
కళా బృందాల ప్రదర్శన

చిన్నశేష వాహనం ముందు కళాబృందాల ప్రదర్శనలు అలరించాయి. తమిళనాడులోని దిండిగల్‌కు చెందిన 25 మంది డ్రమ్స్‌తో భక్తులను పరవశింపచేశారు. చెన్నైకి చెందిన సత్యప్రియ బృందం భరతనాట్యం, కేరళకు చెందిన 30 మంది మహిళా కళాకారుల మోహినీ అట్టం.. హైదరాబాదుకు చెందిన 22 మంది మహిళలు దేవతామూర్తుల వేషధారణ, భరతనాట్యం ఆకట్టుకున్నాయి. విశాఖపట్నంకు చెందిన 32 మంది చిన్నారులు, యువతులు మహిషాసురమర్దిని నృత్య రూపకం ప్రదర్శించారు. అమలాపురంలోని అయోధ్య సీతారామ కోలాట భజన మండలికి చెందిన మహిళల కోలాటం, హైదరాబాదు రఘు రమ్య అకాడమీకి చెందిన 28 మంది కళాకారుల శ్రీనివాస కళ్యాణం, కేరళకు చెందిన కళాకారుల నవదుర్గల వేషధారణ అలరించాయి.





చిన్నశేషుడిపై చిద్విలాసంగా..

మరిన్ని విశేషాలు 8వ పేజీలో

కార్తీక బ్రహ్మోత్సవాల తొలిరోజున వేకువజామునే పద్మావతీ దేవికి నిత్య కైంకర్యాలు నిర్వహించారు. మధ్యాహ్నం 12.30 గంటలకు శ్రీకృష్ణస్వామి ముఖమండపంలో స్నపన తిరుమంజనం నిర్వహించారు. ఆస్థాన మండపంలో సాయంత్రం 6 గంటలకు వేడుకగా ఊంజల్ సేవ జరిగింది. అనంతరం అమ్మవారిని వాహన మండపానికి తీసుకొచ్చి చిన్నశేష వాహనంపై కొలువుదీర్చారు. పట్టుపీతాంబర, వజ్రవైడూర్య ఆభరణాలతో దివ్య మంగళ స్వరూపిణిగా చిన్న శేషుడిపై రాజసంతో తిరుమాడవీధుల్లో రాత్రి ఏడు గంటలకు ఊరేగుతూ భక్తులను కటాక్షించారు.

అద్దాల మండపంలో అమ్మవారు

కార్తీక బ్రహ్మోత్సవాల నేపథ్యంలో తొమ్మిది రోజుల పాటూ అమ్మవారి ఉత్సవర్లు అద్దాల మండపంలో కొలువై ఉంటారు. గురువారం రాత్రి వాహనసేవ అనంతరం అమ్మవారిని అద్దాల మండపంలో కొలువుదీర్చారు. రోజూ ఉదయం ఇక్కడినుంచే అమ్మవారిని తీసుకొచ్చి వాహనసేవలు, ఇతర సేవలు నిర్వహిస్తారు. రాత్రి వాహనసేవ పూర్తవగానే అమ్మవారిని అద్దాల మండపానికి వేంచేపు చేస్తారు. తొమ్మిదవ రోజు పంచమీతీర్థం నాడు రాత్రి అమ్మవారిని సన్నిధిలో కొలువుదీరుస్తారు. బ్రహ్మోత్సవాల్లో మాత్రమే ఇలా సన్నిధిలో కాకుండా అద్దాల మండపంలో కొలువై ఉండటం విశేషం.





ధ్వజారోహణం

తిరుచానూరు కార్తీక బ్రహ్మోత్సవాలు ప్రారంభం

దోపిడీయత్నం

ఇది మన్నారుపోలూరు చేనేత కాలనీలోని చివరి ఇల్లు. పట్టపగలే ఇక్కడ దోపిడీకి ముగ్గురు దుండగులు యత్నించారు. కత్తితో బెదిరించారు. చివరకు ఓ మహిళ కేకతో పలాయనం చిత్తగించారు.

8



ఒక రోజు ముందే పింఛన్ల పంపిణీ

మంగళం, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): డిసెంబరు ఒకటో తేది ఆదివారం. దీంతో ఒకరోజు ముందుగా శనివారమే ఎన్టీఆర్ భరోసా పింఛన్లను పంపిణీ చేయనున్నారు. జిల్లాలోని 2,64,636 మందికి రూ.113 కోట్లు ఈనెల 30న అందజేయనున్నట్లు డీఆర్‌డీఏ పీడీ శోభన్‌బాబు గురువారం తెలిపారు. ఆ రోజు పింఛన్లు పొందని వారు 2వ తేది (సోమవారం) తీసుకోవచ్చన్నారు.

ఎస్వీయూ పీజీ మూడో సెమిస్టర్ పరీక్షల వాయిదా

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): ఎస్వీయూలో డిసెంబరు 2 నుంచి నిర్వహించాల్సిన పీజీ మూడో సెమిస్టర్ పరీక్షలు వాయిదా పడ్డాయి. 7 నుంచి నిర్వహించాలని అధికారులు నిర్ణయించారు. ఈ మేరకు గురువారం ఉత్తర్వులను జారీ చేశారు.

తిరుపతిలో కిడ్నాప్ కలకలం

ఈ చర్యకు పాల్పడింది ప్రియురాలే

గంట వ్యవధిలో ఛేదించిన పోలీసులు

8లో

నలుగురికి సీఎం సహాయనిధి

చెక్కులు అందజేసిన చంద్రబాబు

చంద్రగిరి, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): ఆరోగ్య సమస్యలతో సతమతమవుతున్న నలుగురికి సీఎంఆర్ఎఫ్ కింద సీఎం చంద్రబాబు గురువారం రాత్రి చెక్కులు అందించారు. వాయల్పాడు మండలానికి చెందిన జె.కుసుమకుమారి కుమార్తె మానస(13) అంకుర హాస్పిటల్‌లో ఊపిరితిత్తుల వ్యాధితో చికిత్స పొందుతున్న వీడియో ముఖ్యమంత్రికి పంపడంతో ఆయన చలించిపోయారు. వారికి సీఎం సహాయనిధి నుంచి రూ.ఐదు లక్షల చెక్కు అందజేశారు. చంద్రగిరి మండలం శేషాపురానికి చెందిన పొదిలి శారద కుమారుడు హర్షవర్ధన్ బాబు 19 సంవత్సరాలుగా కిడ్నీ వ్యాధితో బాధపడుతున్న నేపథ్యంలో వారికి ఆర్థికంగా మూడు లక్షల చెక్కు ఇచ్చారు. తిరుపతి రూరల్‌కు చెందిన ఆర్ నాగరాజు తన ఆర్థిక పరిస్థితి బాగోలేదని, తన తల్లి కిడ్నీ సమస్యతో బాధపడుతోందని ఆర్థిక సహాయం కోరడంతో వారికి రూ.రెండు లక్షల చెక్కును అందజేశారు.

ఆదర్శ గ్రామాలుగా అభివృద్ధి చేయండి

గ్రామస్తులు, అధికారులతో సీఎం సమీక్ష

చంద్రగిరి, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): చంద్రగిరి మండలంలోని ఎ.రంగంపేట నుంచి మూలపల్లె వరకు ఆదర్శ గ్రామాలుగా తీర్చిదిద్దాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అధికారులను ఆదేశించారు. గురువారం రాత్రి తన స్వగృహంలో అధికారులు, నారావారిపల్లె పరిసర గ్రామాల వారితో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ప్రతి ఇంటికి సోలార్ ఏర్పాటు చేయాలన్నారు. ఎ.రంగంపేటలోని ఉన్నత పాఠశాలను మరింత అభివృద్ధి చేయాలన్నారు. నారావారిపల్లెలోని ప్రభుత్వ భవనాల్లో స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్లుగా ఏర్పాటు చేసి, ఉపాధి కల్పనకు శ్రీసిటీకి అనుసంధానం చేయాలన్నారు. అదేవిధంగా గ్రామస్తులు మూలపల్లెలో హంద్రీనీవా నీటి ప్రాజెక్టు గత ప్రభుత్వంలో నిలిచిపోయిందని, ఆ ప్రాజెక్టు పూర్తయితే చెరువుల అనుసంధానం చేయడం వలన చంద్రగిరి మండలం సస్యశ్యామలం అవుతుందని గ్రామస్తులు తెలిపారు. ప్రధానంగా రైతులు పంటలు పండించలేకపోతున్నామని, శేషాచలం అడవుల నుంచి కోతుల బెడద అధికంగా ఉందని తెలపడంతో.. తగు చర్యలు చేపట్టాలని అధికారులను సీఎం ఆదేశించారు. ప్రతి రైతుకు ప్రతి నెల రూ.15 వేల రూపాయల ఆదాయం వచ్చేలా రూపకల్పన చేయాలని గ్రామస్తులు కోరారు. దీంతో వ్యవసాయ ఆధారితపంటలు లాభదాయకంగా వచ్చేలా అధికారులు ప్రణాళికలు సిద్ధంచేయాలన్నారు. ఆయా గ్రామస్తులను అడిగి సమస్యలను తెలుసుకున్నారు. సమావేశంలో కలెక్టర్ వెంకటేశ్వర్, డీపీవో సుశీలాదేవి, తిరుపతి కార్పొరేషన్ కమిషనర్ మౌర్య, ఎమ్మెల్యే పులివర్తి నాని, టీడీపీ మండలాధ్యక్షుడు సుబ్రమణ్యంనాయుడు, గ్రామస్తులు గిరినాయుడు, వెంకటపతినాయుడు, నిరంజన్‌నాయుడు, పాశం చంద్రకుమార్‌నాయుడు, నారా సుబ్రమణ్యంనాయుడు, రాకేష్‌చౌదరి తదితరులు పాల్గొన్నారు.

నారా రామ్మూర్తికి ఘన నివాళి

పలువురు రాజకీయ ప్రముఖుల హాజరు

సీఎం చంద్రబాబు సోదరుడు, మాజీ ఎమ్మెల్యే నారా రామ్మూర్తి నాయుడి కర్మక్రియలు గురువారం నారావారిపల్లెలో జరిగాయి. సీఎం చంద్రబాబు, ఆయన సతీమణి భువనేశ్వరి, తనయుడు, మంత్రి లోకేశ్‌తో పాటు నారా, నందమూరి కుటుంబ సభ్యులు, ప్రముఖులు నివాళులర్పించారు. ఆయనతో తమ జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. గ్రామంలోని ప్రాథమిక పాఠశాల సమీపంలోని వ్యవసాయ బావి వద్ద రామ్మూర్తి నాయుడు కుమారులు నారా రోహిత్, గిరీష్‌తో పాటు చంద్రబాబు కుటుంబ సభ్యులు హిందూ సంప్రదాయ ప్రకారం పెద్దకర్మ నిర్వహించారు. ఆ తర్వాత సభావేదికపై రామ్మూర్తి చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి నివాళులర్పించారు. భోజనశాలకు వెళ్లి ఏర్పాట్లను సీఎం పరిశీలించారు. అందరితో ఆత్మీయంగా పలకరించారు. అక్కడనుంచి తిరిగి ఇంటికి చేరుకున్నారు.



శివాలయానికి వెళ్లి..

సీఎం చంద్రబాబునాయుడు, నారా భువనేశ్వరి, మంత్రి లోకేశ్, రామ్మూర్తినాయుడి సతీమణి ఇందిర, నారా గిరీష్, నారా రోహిత్, సీఎం సోదరి హైమావతి తదితరులు గురువారం సాయంత్రం శేషాపురం వద్ద శేషాచల లింగేశ్వర స్వామిని దర్శించుకున్నారు. టీటీడీ అధికారులు సాదరంగా స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు.

సీఎం పరామర్శ

నారావారిపల్లెలో ఇటీవల మృతిచెందిన నారా చిన్నబ్బనాయుడి ఇంటికి సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్ వెళ్లి ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. చిన్నబ్బ సతీమణి సావిత్రి, కుమారుడు నారా కిరణ్‌ను పరామర్శించారు. కందులవారిపల్లెలో ఇటీవలమృతి చెందిన పులివర్తి హరిహరచౌదరి ఇంటికి వెళ్ళి వారి కుటుంబ సభ్యులను చంద్రబాబు పరామర్శించారు. సంప్రదాయం ప్రకారం రాత్రి నారా గిరీష్, నారా రోహిత్ గ్రామంలోని అన్ని ఇళ్లకు వెళ్లి దీపం చూశారు.





డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్‌రావు, మంత్రులు కె.అచ్చెన్నాయుడు, అనగాని సత్యప్రసాద్, బీసీ జనార్దన్ రెడ్డి, కొల్లు రవీంద్ర, నిమ్మల రామానాయుడు, ఎం.రాంప్రసాదరెడ్డి, వి.అనిత, ఎస్.సవిత, వాసంశెట్టి సుభాష్, కేంద్ర మాజీ మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి, ఎమ్మెల్సీలు కంచర్ల శ్రీకాంత్, సిపాయి సుబ్రహ్మణ్యం, ఎమ్మెల్యేలు అమరనాథరెడ్డి (పలమనేరు), కిశోర్‌కుమార్‌రెడ్డి (పీలేరు), మురళి (పూతలపట్టు), పులివర్తి నాని (చంద్రగిరి), ఆదిమూలం (సత్యవేడు), గాలి భానుప్రకాష్ (నగరి), గురజాల జగన్మోహన్ (చిత్తూరు), బొజ్జల సుధీర్ రెడ్డి (శ్రీకాళహస్తి), షాజహాన్ బాషా (మదనపల్లె), ధూళిపాళ్ల నరేంద్ర (పొన్నూరు), నెలవల విజయశ్రీ (సూళ్లూరుపేట), థామస్ (గంగాధర్ నెల్లూరు) శ్రీనివాసులు (రాయదుర్గం), మాజీ మంత్రులు నిమ్మకాయల చినరాజప్ప, దేవినేని ఉమామహేశ్వరరావు, మాజీ ఎమ్మెల్సీలు బుద్దా వెంకన్న, దొరబాబు, మాజీ ఎమ్మెల్యేలు సుగుణమ్మ, సీకే బాబు, ఏఎస్ మనోహర్, నెలవల సుబ్రహ్మణ్యం, టీటీడీ సభ్యుడు భానుప్రకాష్‌రెడ్డి, యాదవ కార్పొరేషన్ చైర్మన్ నరసింహ యాదవ్, శాప్ చైర్మన్ రవి నాయుడు, మీడియా కోఆర్డినేటర్ శ్రీధర్ వర్మ, నాయీబ్రాహ్మణ కార్పొరేషన్ ఛైర్మన్ రుద్రకోటి సదాశివం, కార్పొరేటర్లు ఆర్సీ మునికృష్ణ, అన్నా అనిత, నరసింహాచారి, కూటమి పార్టీల నేతలు, శ్రేణులు, చుట్టుపక్కల గ్రామాల ప్రజలు రామ్మూర్తి నాయుడి చిత్రపటం వద్ద నివాళులర్పించారు.

- తిరుపతి / చంద్రగిరి, ఆంధ్రజ్యోతి

నేడు సీఎం తిరుగు ప్రయాణం

తిరుపతి (నేరవిభాగం), ఆంధ్రజ్యోతి: సీఎం చంద్రబాబు శుక్రవారం అమరావతికి తిరుగు ప్రయాణం కానున్నారు. ఉదయం 9.30 గంటలకు నారావారిపల్లెనుంచి బయలుదేరి 10 గంటలకు రేణిగుంట విమానాశ్రయానికి చేరుకుంటారు. విమానంలో గన్నవరం విమానాశ్రయం చేరుకుని.. అక్కడ్నుంచి వెలగపూడి సచివాలయానికి వెళ్లనున్నారు. మంత్రి లోకేశ్ గురువారం రాత్రి తిరుగు ప్రయాణమయ్యారు.

భారీ భద్రత: నారావారిపల్లెకు సీఎం చంద్రబాబు, పలువురు మంత్రులు, ప్రజాప్రతినిధులు, నాయకులు రావడంతో గురువారం పోలీసులు భారీ భద్రతా చర్యలు చేపట్టారు. ముఖ్యమంత్రి నివాసంలోకి అనుమతి ఉన్నవారిని మాత్రమే మెటల్ డిటెక్టర్లతో తనిఖీలు చేసి అనుమతించారు. చాలామంది నాయకులను సీఎం నివాసంలోకి పోలీసులు అనుమతించలేదు. దీనిపై కొందరు పోలీసులతో వాదనకు దిగారు. జిల్లా ఎస్పీ సుబ్బరాయుడు ఆదేశాలతో ప్రధాన ద్వారం వద్ద తిరుమల అదనపు ఎస్పీ రామకృష్ణ, డీఎస్పీ రవికుమార్, సీఐ అహమ్మద్, పోలీసులు బందోబస్తు చేపట్టాయి. భోజనశాల, వేదిక, సభా ప్రాంగణం, సీఎం ఇంటి వద్ద భారీ ఎత్తున పోలీసు బలగాలు మోహరించాయి. డాగ్ స్క్వాడ్లతో పలు ప్రాంతాల్లో తనిఖీలు చేశారు. కలెక్టర్ వెంకటేశ్వర్ ఇతర అధికారులు డీఐజీ షిమోషి, ఎస్పీ సుబ్బరాయుడు, అదనపు ఎస్పీలు, డీఎస్పీలు బందోబస్తు విధుల్లో పాల్గొన్నారు. కాగా, గురువారం రాత్రి చంద్రబాబు నారావారిపల్లెలో బస చేయడంతో పోలీసులు సీఎం ఇంటి చుట్టూ భద్రత పెంచారు.

శ్రీవారి సేవలో ప్రముఖులు



వెంకటరావు, జగన్మోహన్, పీతల సుజాత

తిరుమల, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని గురువారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వారిలో.. ప్రభుత్వ విప్ వెంకటరావు, ఎమ్మెల్యే జగన్మోహన్, ఎమ్మెల్సీ కల్యాణి, మాజీ మంత్రి పీతల సుజాత, తెలంగాణ ఎమ్మెల్యే గడ్డం వినోద్, తమిళ నటుడు అజయ్ రత్నం, కన్నడ నటి రచిత రామ్ ఉన్నారు. వీరికి ఆలయాధికారులు ప్రత్యేక దర్శనం కల్పించి, లడ్డూ ప్రసాదాలు అందజేశారు.

నూతన ఔషధ అభివృద్ధి సులభం



మాట్లాడుతున్న ప్రొఫెసర్ రవి శంకర్

రామచంద్రాపురం, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): నూతన ఔషధ అభివృద్ధిలో కృత్రిమ మేధకు ప్రాధాన్యం బాగా పెరిగిందని, తద్వారా ఈ ప్రక్రియ సులభతరమైందని తిరుపతి ఐఐటీ ప్రొఫెసర్ రవిశంకర్ అన్నారు. మండలంలోని వెంకట్రామాపురం సమీపంలోని సెవెన్‌హిల్స్ ఫార్మసీ కళాశాల, అనంతపురం జేఎన్‌టీ యూనివర్సిటీ సంయుక్తంగా నిర్వహిస్తున్న ఐదు రోజుల ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ నాలుగవ రోజు కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. విద్యార్థులు నూతన ఆవిష్కరణలపై దృష్టి పెట్టాలన్నారు. అందుకు అధ్యాపకులు సహకారం అందించాలని తెలిపారు. పద్మావతి పాలిటెక్నిక్ కళాశాల సీనియర్ లెక్చరర్ డాక్టర్ గోపీనాథ్, వైస్ ప్రిన్సిపాల్ ప్రసన్నరాజు, కోఆర్డినేటర్ జ్యోతి పాల్గొన్నారు.

విద్యార్థులు వ్యవసాయ క్షేత్ర సందర్శన



వేమూరులో ప్రకృతి వ్యవసాయాన్ని పరిశీలిస్తున్న విద్యార్థులు

తిరుచానూరు, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): ఎస్వీ యూనివర్సిటీ సామాజిక విభాగం విద్యార్థులు గురువారం వేమూరులోని ప్రకృతి వ్యవసాయ క్షేత్రాన్ని సందర్శించారు. దామ అయ్యప్పనాయుడు తన ప్రకృతి వ్యవసాయ క్షేత్రంలో దేశీయ ఆవుల మూత్రం, పేడ, వివిధ ఆకులతో తయారు చేసిన కషాయాలు, ద్రావణాలు, జీవామృతం గురించి విద్యార్థులకు వివరించారు. డిపార్ట్‌మెంట్ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ కుసుమ, డాక్టర్ ముకుందనాయుడు, రమణయ్య, ప్రవీణ్ ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పించారు. జిల్లా ప్రకృతి వ్యవసాయ ప్రాజెక్టు మేనేజర్ షణ్ముగం పాల్గొన్నారు.

జనవాణిలో వినతుల స్వీకరణ



అర్జీలు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు

తిరుపతి అర్బన్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): మంగళగిరిలోని జనసేన పార్టీ కేంద్ర కార్యాలయంలో గురువారం జరిగిన జనావాణి కార్యక్రమంలో ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. 43 వినతులు అందగా సంబంధిత విభాగాల అధికారులకు ఫోన్‌చేసి వెంటనే పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో ఉమ్మడి చిత్తూరు జిల్లా జనసేన పార్టీ అధ్యక్షుడు పసుపులేటి హరిప్రసాద్, నగరాధ్యక్షుడు రాజారెడ్డి, రాష్ట్ర అధికార ప్రతినిధి కీర్తన, న్యాయవాది గాలి శ్రీనివాసులు, సాని శీనురాయల్ తదితరులు పాల్గొన్నారు.

చెట్టు విరిగి కాన్వాయ్‌పై పడి అద్దాలు ధ్వంసం



కారుపై పడిన చెట్టు

చంద్రగిరి, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): నారావారిపల్లెలో టీటీడీ కల్యాణ మండపం ఆవరణలో సీఎం కాన్వాయ్‌లో ఓ కారును చెట్టు పక్కన పెట్టారు. చెట్టు విరిగి కారుపై పడింది. కారు అద్దాలు ధ్వంసమయ్యాయి. కలెక్టర్ అక్కడే ఉన్న సిబ్బంది చేత చెట్టు రంపాలతో చెట్టు కొమ్మలను తొలగించారు. అయితే ఈ చెట్టు విరిగి పడటం వలన ఎవ్వరికీ ఎలాంటి ప్రమాదమూ జరగలేదు.

అన్నప్రసాదాలు వడ్డించిన విప్ చిరంజీవి




తిరుమల, నవంబరు28(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ విప్ వేపాడ చిరంజీవి గురువారం భక్తులకు అన్నప్రసాదాలు వడ్డించారు. శ్రీవారి దర్శనార్థం గురువారం తిరుమలకు వచ్చిన ఆయన రాత్రి వెంగమాంబ అన్నప్రసాద భవనానికి కుటుంబ సమేతంగా వెళ్లారు. కొంత సమయం భక్తులకు అన్నప్రసాదాలు వడ్డించారు. అనంతరం భక్తులతో కలిసి తానూ అన్నప్రసాదాలు స్వీకరించారు. అన్నప్రసాదాల నాణ్యతపై సంతృప్తి వ్యక్తం చేశారు.

నష్టపరిహారం అందేలా కృషి చేస్తాం



వరి పంటను పరిశీలిస్తున్న టీడీపీ నేతలు

భాకరాపేట, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): ఏనుగుల దాడిలో దెబ్బతిన్న పంటలకు నష్టపరిహారం అందేలా కృషి చేస్తామని టీడీపీ మండలాధ్యక్షుడు బెల్లంకొండ మురళి తెలిపారు. బుధవారం రాత్రి చిట్టేచెర్ల పంచాయతీలో ఏనుగులు నష్టపరిచిన పంటలను ఆయన గురువారం పరిశీలించారు. బాధిత రైతులతో మాట్లాడారు. చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని దృష్టికి తీసుకెళ్లి రైతులకు నష్టపరిహారం అందేలా కృషి చేస్తామన్నారు. వీఆర్వో మారుతి, కార్యదర్శి రామ్మోహన్, సర్పంచ్ నాగచంగమ నాయుడు, టీడీపీ నేతలు సహదేవరెడ్డి, చంద్రశేఖర రెడ్డి పాల్గొన్నారు.



నారా రామ్మూర్తి నాయుడి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మంత్రులు అచ్చెన్నాయుడు, సత్యప్రసాద్, ఎమ్మెల్యేలు నాని, కిషోర్‌కుమార్‌రెడ్డి, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వీరపల్లి హేమాంబరధరరావు తదితరులు

చంద్రగిరి

రూరల్ ఎక్సైజ్ స్టేషన్ తనిఖీ

తిరుపతిరూరల్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): తిరుపతి రూరల్ ఎక్సైజ్ స్టేషన్‌ను ఉమ్మడి చిత్తూరు జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్ శ్రీనివాసాచారి గురువారం ఆకస్మికంగా సందర్శించారు. రికార్డులను తనిఖీ చేశారు. డ్రగ్స్ రవాణా, విక్రయాల కట్టడిపై పలు సలహాలు, సూచనలు చేశారు. సారా, ఎన్‌డీపీఎల్‌లపై సమీక్షించి.. కేసుల నమోదు సంఖ్యను పెంచి నేరాలను అదుపు చేయాలని ఆదేశించారు. పాత నేరస్తులను బైండోవర్ చేయాలని తెలిపారు. సీఐ నరసానాయుడు పాల్గొన్నారు.

కాంగ్రెస్ చంద్రగిరి కోఆర్డినేటర్‌గా లోకేశ్‌రెడ్డి



చంద్రగిరి, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ చంద్రగిరి నియోజకవర్గ కోఆర్డినేటర్‌గా ఐరాల లోకేశ్‌రెడ్డి నియమితులయ్యారు. ఆయన మాట్లాడుతూ తనపై నమ్మకంతో నియోజకవర్గ బాధ్యతలు అప్పగించిన పీసీసీ అధ్యక్షురాలు షర్మిలకు, సహకరించిన డీసీసీ అధ్యక్షుడు భాస్కర్, నాయకులు వేణుగోపాల్, దొడ్డారెడ్డి రాంభూపాల్‌రెడ్డిలకు కృతజ్ఞతలు తెలిపారు. నియోజకవర్గంలో పార్టీ బలోపేతానికి కృషి చేస్తానన్నారు.

డ్రంక్ అండ్ డ్రైవ్‌లో ఇద్దరికి జరిమానా

భాకరాపేట, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): మద్యం తాగి వాహనాలు నడిపిన ఇద్దరికి రూ.15 వేల జరిమానా పడినట్లు భాకరాపేట ఎస్ఐ రాఘవేంద్ర తెలిపారు. గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఇటీవల వాహనాల తనిఖీల్లో భాగంగా పట్టుబడిన ఇద్దరిని కోర్టులో హాజరుపరచగా జడ్జి వారికి రూ.15 వేల జరిమానా విధించారన్నారు. అదేవిధంగా బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగుతున్న ఎనిమిది మందికి రూ.వెయ్యి చొప్పున జరిమానా పడినట్లు తెలిపారు. ద్విచక్ర వాహనదారులు మద్యం తాగి వాహనాలు నడపరాదని హెచ్చరించారు.

రిజర్వేషన్లపై సుప్రీం తీర్పును స్వాగతిస్తున్నాం

హిందూ ఉపాధ్యాయ సమితి అధ్యక్షుడు మహేష్

తిరుపతి(గాంధీరోడ్డు), నవంబరు28(ఆంధ్రజ్యోతి): కేవలం రిజర్వేషన్ల ప్రయోజనాలు పొందడానికి తమను తాము హిందువులుగా పేర్కొనడాన్ని అనుమతించబోమన్న సుప్రీం కోర్టు తీర్పును స్వాగతిస్తున్నామని హిందూ ఉపాధ్యాయసమితి జాతీయ అధ్యక్షుడు మహేష్ దేగల ఒక ప్రకటనలో తెలిపారు. ఈ తీర్పు ద్వారా ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లు హిందువులకు మాత్రమేనని స్పష్టంగా తెలిపారని పేర్కొన్నారు. రంజాన్ మాసంలో ముస్లిం ఉద్యోగులకు శుక్రవారం రోజున గంట అనుమతి ఇస్తున్నారని, అదే తరహాలో కార్తీక, మార్గశిర మాసాల్లో హిందూ ఉద్యోగులకు గంట ప్రత్యేక అనుమతి కోసం ఐదేళ్లుగా కోరుతున్నామని పేర్కొన్నారు. ఈ దిశగా పాలకులు స్పందించాలని కోరారు.

ముగ్గురికి డాక్టరేట్ల ప్రదానం



అనురాధ, పుష్పలత, శోభారాణి

తిరుపతి (విశ్వవిద్యాలయాలు) నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): ఎస్వీయూ, పద్మావతి వర్సిటీలు ముగ్గురు పరిశోధకులకు డాక్టరేట్లను ప్రదానం చేశాయి. ఎస్వీయూ హిందీ పరిశోధకురాలు ఎ.అనురాధ దళిత సమాజాన్ని ప్రతిబింబించిన జయప్రకాష్ కర్దం - కొలకలూరి ఇనాక్ కథలు అంశంపై ప్రొఫెసర్ ప్రకాష్ పర్యవేక్షణలో పరిశోధన పూర్తి చేశారు. పద్మావతి వర్సిటీ బయోసైన్స్ స్కాలర్ వి.పుష్పలత ఫార్మకోగ్నస్టికల్ స్టడీస్ ఆన్ సమ్ ఇంపార్టెంట్ మెడిసినల్ ప్లాంట్స్ ఇన్ చిత్తూరు అంశంపై ప్రొఫెసర్ సుజాత పర్యవేక్షణలో పరిశోధన పూర్తి చేశారు. పద్మావతి వర్సిటీ బయోసైన్స్ స్కాలర్ బి.శోభారాణి టాక్సోనోమిక్ ఇన్వెస్టిగేషన్స్ ఆన్ ఫ్రెష్ వాటర్ అల్గేజ్ ఆఫ్ కర్నూలు అంశంపై ప్రొఫెసర్ సుజాత పర్యవేక్షణలో పరిశోధన పూర్తి చేశారు.

హౌస్‌హోల్డ్ జియో ట్యాగింగ్‌పై అపోహలు వద్దు

తిరుపతి,(గాంధీరోడ్డు), నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): ఏపీ ప్రభుత్వం సచివాలయ సిబ్బంది ద్వారా చేపడుతున్న హౌస్‌హోల్డ్ జియోట్యాగింగ్ సర్వేపై ఎలాంటి అపోహలూ వద్దని తిరుపతి నగర పాలక సంస్థ అసిస్టెంట్ కమిషనర్ అమరయ్య, రూరల్ మండల ఎంపీడీవో రామచంద్ర పేర్కొన్నారు. గ్రామ పంచాయతీ/సెక్రటేరియట్ (నగరాలు, పట్టణాలు, గ్రామాలు) పరిధిలో ఎన్ని ఇళ్లు ఉన్నాయి.. ఎవరు నివాసం ఉంటున్నారు.. అనే సమాచారం కోసం ఈ సర్వేని నిర్వహిస్తున్నారని తెలిపారు. ప్రకృతి వైపరీత్యాలు, అగ్ని ప్రమాదం వంటివి జరిగినప్పుడు ప్రభుత్వం సాయం అందించేందుకు హౌస్‌హోల్డ్ మ్యాపింగ్ డేటా చేస్తున్నారని పేర్కొన్నారు. కాగా ఈ సర్వేకి సంబంధించి గురువారం నుంచి కొత్తగా మూడు ఆప్షన్స్ వచ్చాయని, ఇందులో ఇంటి యజమాని మరణించి ఉంటే డెత్ అని, ఇల్లు ఖాళీ చేసి వేరే ప్రాంతానికి మైగ్రేట్ అయివుంటే పర్మినెంట్ మైగ్రేషన్ అని, ఇంటి వద్దకు ఉద్యోగులు వచ్చినప్పుడు రెండు మూడు రోజులుగా డోర్‌లాక్ చేసి ఉంటే ఫోన్‌చేసి ఓటీపీ ద్వారా జియోట్యాగ్‌ని చేసే వెసులుబాటును ప్రభుత్వం కల్పించిందని వివరించారు. ఫోన్‌చేసిన వ్యక్తి సచివాలయ సిబ్బంది అని తెలిసినప్పుడు మాత్రమే వివరాలు చెప్పాలని సూచించారు. తిరుపతిలో గురువారానికి 71శాతం, తిరుపతి రూరల్ మండలంలో 80శాతం జియోట్యాగింగ్ పూర్తయిందని తెలిపారు.

17 నుంచి సుప్రభాతసేవ స్థానే తిరుప్పావై

తిరుమల, నవంబరు28(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి ఆలయంలో డిసెంబరు 17వ తేదీ నుంచి సుప్రభాత స్థానంలో తిరుప్పావై పఠనం జరగనుంది. శ్రీవారి మాసోత్సవాల్లో అత్యంత ముఖ్యమైనదిగా భావించే ధనుర్మాసం ఘడియలు డిసెంబరు 16వ తేది ఉదయం ప్రారంభంకానున్నాయి. ఈక్రమంలో 17వ తేదీ వేకువజామున శ్రీవారికి నిర్వహించే సుప్రభాత స్థానంలో తిరుప్పావై నివేదిస్తారు. తిరిగి ధనుర్మాస ఘడియలు ముగిసేవరకు తిరుప్పావై పఠనమే కొనసాగిస్తారు. ఈరోజుల్లో తిరుమల పెద్దజీయర్‌మఠంలోనూ ఉదయం తిరుప్పావై పాశురాలను పారాయణం చేస్తారు. డిసెంబరు నెలలో 1వ తేదీన 4విడత అధర్వణ వేదపారాయణం మొదలుకానుంది. 11న సర్వఏకాదశి, 12న చక్రతీర్థ ముక్కోటి, 15న కార్తీక దీపోత్సవం, 29న మాసశివరాత్రి, 30న అధ్యయనోత్సవాలు ప్రారంభంకానున్నాయి.

సార్.. నా గోడు పట్టించుకోండి

- నారావారిపల్లెలో కలెక్టర్‌కు ఓ రైతు వేడుకోలు



తిరుపతి(నేరవిభాగం) నవంబర్ 28(ఆంధ్రజ్యోతి): 'సార్... మాది పాలమంగళం. మా గ్రామంలో ఉన్న భూమికి సంబంధించి కొన్ని సమస్యలు ఉన్నాయి. ఎంత మంది అధికారుల వద్దకు వెళ్లినా పట్టించుకోలేదు' అంటూ గురువారం నారావారిపల్లెలో కలెక్టర్ వెంకటేశ్వర్ ఎదుట రైతు సుధాకర్ తన గోడు వెలిబుచ్చారు. సీఎం, మంత్రులు, ఎమ్మెల్యేల కార్యక్రమాల్లో బిజీగా ఉన్నప్పటికీ ఆయన రైతు నుంచి అర్జీ, భూమి పత్రాలు తీసుకుని పరిశీలించారు. సీఎం వెళ్లిన వెంటనే సమస్యను పరిశీలించి పరిష్కరిస్తానని ఆ రైతుకు హామీ ఇచ్చారు.

కార్తీక బ్రహ్మోత్సవ వేళ

అలరిస్తున్న సాంస్కృతిక కార్యక్రమాలు



పౌరాణిక కళా రూపాన్ని ప్రదర్శిస్తున్న కళాకారులు



భరతనాట్య ప్రదర్శన నిర్వహిస్తున్న కళాకారిణి

తిరుపతి (విశ్వవిద్యాలయాలు) నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): తిరుచానూరు పద్మావతి అమ్మవారి కార్తీక బ్రహ్మోత్సవాల్లో భాగంగా టీటీడీ హిందూ ధర్మ పరచార పరిషత్ ఆధ్వర్యంలో ఆధ్యాత్మిక, ధార్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను అలరిస్తున్నాయి. తిరుచానూరు ఆస్థాన మండపం, శిల్పారామం, మహతి కళా క్షేత్రం, అన్నమాచార్య కళా మందిరం, త్యాగరాజ మండపం, రామచంద్ర పుష్కరిణి కేంద్రాల్లో ఈ కార్యక్రమాలు నిర్వహించారు. తిరుచానూరు ఆస్థాన మండపంలో ఎస్వీ సంగీత నృత్య కళాశాల ఆధ్వర్యంలో మంగళధ్వని, ఎస్వీ వేద అధ్యయన సంస్థకు చెందిన పండితులతో చతుర్వేద పారాయణం నిర్వహించారు. తిరుపతికి చెందిన శ్రీరంగం రామానుజాచార్యుల ధార్మికోపన్యాసం, మోటూరు బ్రదర్స్ బృందం భక్తి సంగీత కార్యక్రమం నిర్వహించారు. తిరుపతికి చెందిన శ్రీరాములు బృందం హరికథ పారాయణం చేశారు. సాయంత్రం తిరుపతికి చెందిన విశాలాక్షి బృందం అన్నమయ్య విన్నపాలు, ఊంజల్ సేవలో మధుసూదనరావు బృందం అన్నమయ్య సంకీర్తనలు గానం చేశారు. మహతి కళా క్షేత్రంలో తిరుపతికి చెందిన శివ నాట్య కళా నిలయం వారు భరతనాట్యం, అన్నమాచార్య కళా మందిరంలో హైదరాబాదుకు చెందిన వెంకటేశ్వర్లు బృందం కూచిపూడి నృత్యం, రామచంద్ర పుష్కరిణి వద్ద మహబూబ్‌నగర్‌కు చెందిన చంద్రశేఖర్ బృందం భక్తి సంగీత కచేరి నిర్వహించారు. శిల్పారామంలో విజయవాడకు చెందిన ఆనంద్ బృందం కూచిపూడి నృత్య ప్రదర్శన నిర్వహించింది.



శబరిమలైకి రేణిగుంట మీదుగా 44 ప్రత్యేక రైళ్లు

తిరుపతి(ఆటోనగర్), నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నం-కొల్లం, శ్రీకాకుళం రోడ్డు-కొల్లం మధ్య డిసెంబరు 4 నుంచి ఫిబ్రవరి 26వ తేదీ వరకు 44 ప్రత్యేక రైళ్లు నడపనున్నట్లు దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్వో శ్రీధర్ ఒక ప్రకటనలో తెలిపారు. విశాఖపట్నం-కొల్లం మధ్య రాకపోకలు సాగించే 26 ప్రత్యేక రైళ్లు(08539-08540) విశాఖపట్నంలో 4వ తేదీ నుంచి ప్రతి బుధవారమూ ఉదయం 8.20 గంటలకు బయలుదేరి దువ్వాడ, సామర్లకోట, రాజమండ్రి, ఏలూరు, విజయవాడ, తెనాలి, ఒంగోలు, నెల్లూరు, గూడూరు, రేణిగుంట, కాట్పాడి, జోలార్‌పేట, సేలం, ఈరోడ్, తిరుపూర్, పాలక్కాడ్, త్రిసూర్, అలువ, ఎర్నాకులం రోడ్డు, చెంగనచ్చేరి, తిరువల్ల, చెంగనూర్, కాయన్‌కులం మీదుగా ప్రయాణిస్తూ మరుసటి రోజు మధ్యాహ్నం 12.55 గంటలకు చేరుకుంటాయి.

- కొల్లంలో ఈ ప్రత్యేక రైళ్లు ప్రతి గురువారమూ రాత్రి 7.35 గంటలకు బయలుదేరి వచ్చిన మార్గంలోనే ప్రయాణిస్తూ మరుసటి రోజు రాత్రి 11.20 గంటలకు చేరుకుంటాయి. ఈ రైళ్లు డిసెంబరు 5 నుంచి ఫిబ్రవరి 27వ తేదీ వరకు రాకపోకలు సాగిస్తాయి.
- శ్రీకాకుళం రోడ్డు-కొల్లం మధ్య నడిచే ప్రత్యేక రైళ్లు(08553-08554) డిసెంబరు ఒకటో తేదీ నుంచి జనవరి 27వ తేదీ వరకు రాకపోకలు సాగిస్తాయి. శ్రీకాకుళం రోడ్డు నుంచి ప్రతి ఆదివారమూ ఉదయం 6 గంటలకు బయలుదేరి పొందూరు, చీపురుపల్లి, విజయనగరం, కొత్తవలస, పెందుర్తి, దువ్వాడ, అనకాపల్లి, సామర్లకోట, రాజమండ్రి, ఏలూరు, విజయవాడ, ఒంగోలు, నెల్లూరు, గూడూరు, రేణిగుంట, కాట్పాడి మీదుగా కొల్లంకు మరుసటి రోజు మధ్యాహ్నం 2.30 గంటలకు చేరుకుంటాయి.
- కొల్లంలో ఈ ప్రత్యేక రైళ్లు డిసెంబరు 2వ తేదీ నుంచి ప్రతి సోమవారమూ సాయంత్రం 4.30 గంటలకు బయలుదేరి వచ్చిన మార్గంలోనే ప్రయాణిస్తూ బుధవారం అర్ధరాత్రి 2.30 గంటలకు శ్రీకాకుళం రోడ్డుకు చేరుకుంటాయి.

సీమలో బీసీలకు న్యాయం చేయండి

- తుడా బీసీలకు ఇవ్వాలి ● కూటమి ప్రభుత్వాన్ని కోరిన బీసీ పరిరక్షణ సమితి

తిరుపతి, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : రాయలసీమ జిల్లాల్లో బీసీ వర్గాలకు అనుకొన్న స్థాయిలో పదవులు రాలేదని, గ్రేటర్ రాయలసీమ జిల్లాల్లో బీసీ ఎమ్మెల్యేల ప్రాతినిథ్యం కూడా తక్కువేనని, తుడా లాంటి సంస్థకు బీసీలను చైర్మన్ చేయాలని ఏపీ బీసీ పరిరక్షణ సమితి నాయకులు కోరారు. గురువారం సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి తంజావూరు మునేంద్ర మీడియాతో మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడానికి బీసీ కులాల కృషిని గుర్తించి 34 శాతం పదవులు ఇవ్వాలని తీర్మానించడం సంతోషమన్నారు. రాష్ట్రాన్ని యూనిట్‌గా తీసుకుంటే ఉత్తరాంధ్రలో బీసీ కులాలుగా పిలుచుకునే ఓసీ కులాలు ప్రయోజనం పొందుతున్నాయని చెప్పారు. రాయలసీమ, కోస్తాంధ్రలోని కొన్ని అగ్ర కులాలు ఉత్తరాంధ్రలో బీసీ రిజర్వేషన్స్ పొందుతున్నారని, ఆ కోటాలో వారు బీసీలుగా ప్రయోజనం పొందుతున్నారన్నారు. దీనివలన గ్రేటర్ రాయలసీమ పరిధిలో ఉన్న అసలైన బీసీ కులాలకు చెందిన వారు నష్టపోతున్నారని తెలిపారు. బీసీ కార్పొరేషన్లలో ఇచ్చిన పదవులు తప్ప ఇతర ప్రాముఖ్యత గల కార్పొరేషన్లలో గ్రేటర్ రాయలసీమలో బీసీలకు ప్రాధాన్యం తగ్గిందని గుర్తుచేశారు. బీసీల అభ్యున్నతికి పాటుపడే కూటమి పార్టీల అధిష్ఠానం ఈ విషయంలో దృష్టి సారించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో జిల్లా నాయకులు చంద్రబాబు, శివానూరు వెంకటేష్, యువరాజు, భాస్కర్, రాము తదితరులు పాల్గొన్నారు.

హిస్సార్ ఎక్స్‌ప్రెస్ ఒంగోలులో స్టాపింగ్

తిరుపతి(ఆటోనగర్) నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : తిరుపతి-హిస్సార్ మధ్య రాకపోకలు సాగిస్తున్న ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ ఇకపై ఒంగోలు రైల్వేస్టేషన్‌లో ఆగుతుందని దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్వో ఏ.శ్రీధర్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ఈ వారాంతపు ఎక్స్‌ప్రెస్ డిసెంబర్ 7, 14 తేదీల్లో హిస్సార్ నుంచి, 9, 16, తేదీల్లో తిరుపతి నుంచి రాకపోకలు సాగిస్తాయని పేర్కొన్నారు. హిస్సార్ నుంచి ఈ ప్రత్యేక రైళ్లు (04717) 7వతేదీ ఒకటి, 14వ తేదీ మరొకటి బయలుదేరుతాయి. ఈఎక్స్‌ప్రెస్‌లు(04718) తిరుపతిలో 9వ తేదీ ఒకరైలు, 16వ తేదీ మరో రైలు రాకపోకలు సాగిస్తాయని తెలిపారు. ఒంగోలులో ఆగుతాయని, ఆ ప్రాంత ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పంట పొలాలపై గజదాడులు



ఏనుగులు నష్టపరిచిన టమోటా పంట

భాకరాపేట, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): చిన్నగొట్టిగల్లు మండలంలో వారం రోజులుగా ఏనుగుల దాడులు కొనసాగుతూనే ఉన్నాయి. బుధవారం రాత్రి చిట్టేచర్ల పంచాయతీ బూతంవారిపల్లెకు చెందిన మల్లేశ్వర టమోటా, వరి పంటలను ధ్వంసం చేశాయి. మునికృష్ణ, వెంకటముని, రెడ్డప్ప, వెంకటరామయ్య, బాబు, వెంకటాచలపతి, పద్మావతి, ప్రకాశ్, సిద్దేశ్వర రెడ్డికి చెందిన టమోటా, టెంకాయ, మామిడి చెట్లను నష్టపరిచాయి.

అంధురాలికి ఉద్యోగావకాశం కల్పించండి



తిరుపతి(నేరవిభాగం), నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): పాలసముద్రం మండలం రామలింగాపురం గ్రామానికి చెందిన అంధురాలు నందినికి ఉద్యోగావకాశం కల్పించి ఆదుకోవాలని ఆ మండల మాజీ ఎంపీపీ బి.ఇందిర గురువారం నారావారిపల్లెలో సీఎం చంద్రబాబుకు విజ్ఞప్తిచేశారు. నిరుపేద కుటుంబానికి సహాయం చేయాలని కోరారు.

ఆ అభియోగాలపై వివరణ ఇవ్వండి

రిటైర్డ్ జడ్పీ సీఈవో ప్రభాకరరెడ్డిని ఆదేశించిన ప్రభుత్వం

10 రోజుల్లో వివరణ ఇవ్వకుంటే చర్యలు తప్పవని హెచ్చరిక

చిత్తూరు రూరల్, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): జడ్పీ మాజీ సీఈవో ప్రభాకర రెడ్డిపై వచ్చిన అభియోగాలపై ప్రభుత్వం దృష్టి పెట్టింది.ఆయనపై వచ్చిన 9 ఆరోపణలపై రాతపూర్వకంగా వివరణ ఇవ్వాలని, 10 రోజుల్లోపల వివరణ పంపకుంటే చర్యలు తీసుకుంటామని హెచ్చరించింది.2008 నుంచి 2017 వరకు జడ్పీలో ప్రభాకరరెడ్డి సూపరింటెండెంట్‌గా పనిచేశారు. ఆ తర్వాత ఎంపీడీవోగా ప్రమోషన్ వచ్చి బైరెడ్డిపల్లికి బదిలీ అయినా తిరిగి డిప్యుటేషన్‌పై జడ్పీలోనే ఓఎస్డీగా కొనసాగారు. 2019లో వైసీపీ అధికారంలోకి వచ్చాక మంత్రి పెద్దిరెడ్డి అండతో ఏక కాలంలో జడ్పీ ఏవోగా, డిప్యూటీ సీఈవోగా,ఇన్‌ఛార్జి సీఈవోగా పనిచేసిన ఘనత ఆయనది.దాదాపు పదేళ్లు ఏ పార్టీ అధికారంలో వున్నా జిల్లాపరిషత్‌లో ప్రభాకరరెడ్డి ఆడింది ఆట, పాడింది పాటగా నడిచింది. రికార్డు అసిస్టెంట్ నుంచి ఎంపీడీవో వరకూ ఎవరినైనా తనకు నచ్చకపోతే వేధించేవారని, రాత్రి 11 గంటల వరకూ కార్యాలయంలో ఉంచి పనిచేయించేవారని చెప్పుకునేవారు.జడ్పీ కార్యాలయంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి ఉద్యోగులను వేధించేవారని , చివరకు టాయిలెట్స్ వద్ద కూడా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి ఇబ్బందులకు గురిచేశారన్న విమర్శలున్నాయి. ప్రభాకర రెడ్డి వేధింపుల కారణంగా నాగలాపురం ఎంపీడీవో బాలగణేష్, జడ్పీలో సీనియర్ అసిస్టెంట్ పురుషోత్తంరెడ్డి, టైపిస్ట్ కెనడి, రికార్డ్ అసిస్టెంట్ యుగంధర్ ఏకంగా ప్రాణాలే కోల్పోయారని జడ్పీ ఉద్యోగులే పీఆర్ కమిషనర్‌కు గతంలో ఫిర్యాదు చేశారు.రెండు రోజుల్లో రిటైరవుతారనగా ప్రభాకర రెడ్డి సస్పెండయ్యారు. అప్పట్నుంచీ ఆయన ఎవరికీ కనపడలేదు.ఆయనపై వచ్చిన ఫిర్యాదులను ప్రభుత్వం సీరియస్‌గా తీసుకుంది.మొత్తం 9 అభియోగాలపై వివరణ ఇవ్వాలని గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. 10 రోజుల్లో వివరణ ఇవ్వకుంటే చర్యలు తీసుకుంటామని హెచ్చరించింది. జడ్పీ జనరల్ ఫండ్స్ నుంచీ ఎటువంటి ఆమోదం లేకుండా సుమారు రూ.19.19 లక్షలు వి.కోట మండం పత్రపల్లి కొత్తూరులోని జడ్పీ చైర్మన్ క్యాంపు కార్యాలయ నిర్వహణకు వెచ్చించడం, జిల్లా పరిషత్‌లో విధుల నిర్వహణకు సుమారు ఐదు అద్దె వాహనాలను వాడి రూ. 17.55 లక్షల అద్దె చెల్లించడం, 15వ ఆర్థిక సంఘ నిధుల నుంచి అత్యధిక శాతం పనులను పలమనేరు, పుంగనూరు నియోజకవర్గాలకే కేటాయించడం, 1124 పనులకు గాను సుమారు రూ.78.13 కోట్లు ఖర్చు పెట్టించడం,జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశాల నిర్వహణకు సభ్యుల ఆమోదం లేకుండా జనరల్ ఫండ్స్ నుంచి సుమారు రూ.35.61 లక్షలు ఖర్చు చేయడం, జడ్పీ క్వార్టర్స్ మరమ్మతుల కోసం ఒకే పనిని మూడుగా విభజించి ఒక్కో పనికి రూ.5 లక్షల చొప్పున మొత్తం రూ.15 లక్షలు అంచనా వేసి ఎటువంటి పనులు చేయకుండానే రూ.3.51 లక్షలు చెల్లించడం ఆయనపై వచ్చిన అభియోగాల్లో కొన్ని. జడ్పీలోని కొంత మంది ఉద్యోగులకు ఎటువంటి కారణాలు చూపకుండా వార్షిక గ్రేడ్ ఇంక్రిమెంట్లు మంజూరు చేయలేదని, వేతనాల ఫిక్సేషన్ కూడా ఆలస్యం చేశారని, వారి సర్వీస్ రిజిస్టర్లను ప్రభుత్వానికి పంపలేదని, ఇంకొంత మందికి చివరి వేతన ధ్రువీకరణ పత్రాలను కూడా జారీ చేయలేదని ఆయనపై అభియోగాలున్నాయి.జడ్పీలో పనిచేస్తున్న ముగ్గురు ఏవోలను,ఐదుగురు సిబ్బందిని ఎటువంటి కారణాలు చూపకుండా సస్పెండ్ చేశారని, వారికి సస్పెన్షన్ సమయంలో జీవనాధార భత్యం కూడా మంజూరు చేయకుండా ఇబ్బందులకు గురిచేశారని కూడా అభియోగాలున్నాయి.

బీసీల అభ్యున్నతే ప్రభుత్వ లక్ష్యం



పూలేకు నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే ఆరణి

తిరుపతి అర్బన్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): బీసీల అభ్యున్నతే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు ఉద్ఘాటించారు. గురువారం జ్యోతిరావుపూలే వర్ధంతి సందర్భంగా బాలాజీకాలనీ కూడలిలోని పూలే విగ్రహానికి నివాళి అర్పించారు. ఆయన మాట్లాడుతూ సమానత్వం, సామాజిక న్యాయం కోసం పాటుపడిన గొప్ప వ్యక్తి పూలే అన్నారు. ఆయన ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో అక్కినపల్లి లక్షయ్య, కట్టమంచి చంద్రబాబు, మధు, కృష్ణప్రసాద్, శ్రీనివాసులు, మునస్వామి, రమేష్‌నాయుడు, రాజమోహన్, సురేష్ పాల్గొన్నారు.

పూలేకు ఘన నివాళి



నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ సిపాయి సుబ్రహ్మణ్యం, మేయర్ శిరీష

తిరుపతి(జీవకోన): బాలాజీకాలనీలోని పూలే విగ్రహం వద్ద ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రహ్మణ్యం, మేయర్ డాక్టర్ శిరీష, బీసీ నాయకులు అశోక్ సామ్రాట్ యాదవ్, బుసగాని లక్ష్మయ్య, విడగొట్టి రమణ, సాకం ప్రభాకర్ నివాళులర్పించారు. సమాజం కోసం ఆయన చేసిన సేవలను కొనియాడారు.

పూలే చిరస్మరణీయులు: కలెక్టర్



తిరుపతి (కలెక్టరేట్): మహాత్మా జ్యోతిరావుపూలే వర్ధంతి సందర్భంగా గురువారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ఆయన చిత్రపటానికి కలెక్టర్ వెంకటేశ్వర్ పుష్పాంజలి ఘటించారు. కలెక్టర్ మాట్లాడుతూ కుల వ్యవస్థ నిర్మూలనతో పాటు మహిళోద్ధరణకు రాజీలేని పోరాటం చేసిన మహనీయుడు పూలే అని కొనియాడారు. దేశం గర్వించదగ్గ సంఘ సంస్కర్తల్లో పూలే ముందు వరుసలో ఉంటారని అన్నారు. అందరం ఆయన అడుగుజాడల్లో నడవాలని సూచించారు. జిల్లా రెవెన్యూ అధికారి నరసింహులు, జిల్లా సమాచార పౌర సంబంధాల శాఖాధికారి బాలకొండయ్య, అధికారులు పాల్గొన్నారు.

అసమానతల నిర్మూలనలో పూలే కృషి మరువలేనిది



నివాళులు అర్పిస్తున్న సీఎండీ కె.సంతోషరావు, బీసీ నాయకులు

తిరుపతి(ఆటోనగర్): అసమానతలకు వ్యతిరేకంగా మహాత్మ జ్యోతీరావుపూలే చేసిన కృషి ఎనలేనిదని సదరన్ డిస్కం సీఎండీ కె.సంతోషరావు అన్నారు. తిరుపతి సదరన్ డిస్కం కార్పొరేట్ కార్యాలయంలో గురువారం పూలే వర్ధంతి నిర్వహించారు. కార్యాలయంలో పూలే చిత్రపటం పెట్టి పుష్పాంజలి ఘటించారు. ఆయన మాట్లాడుతూ సమాజంలో వందేళ్ల క్రితం సాంఘిక దుశ్చర్యలను రూపుమాపడానికి ఆయన ఎనలేని కృషి చేశారన్నారు. కార్యక్రమంలో డైరెక్టర్ వై.లక్ష్మీనరసయ్య, సీజీఎంలు కేఆర్ఎస్ ధర్మజ్ఞాని, జానకిరామ్, చీఫ్ విజిలెన్స్ ఆఫీసర్ జనార్దన్‌నాయుడు, జీఎంలు ఎం.కృష్ణారెడ్డి, వెంకటరాజు, ప్రసాద్, పి.మురళి, శోభా వాలంటీనా, సురేంద్రరావు, బీసీ ఉద్యోగుల సంఘం నాయకులు ఎల్.చలపతి, సి.వి.వేణు, జగదీష్ పాల్గొన్నారు. అలాగే ఎస్ఈ కార్యాలయంలో పూలే చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. ఈఈ టెక్నికల్ వాసవీలత, ఎస్ఏవో శ్రీనివాసులు, పీఏ నాగరాజు పాల్గొన్నారు.

పూలే అడుగుజాడల్లో కాంగ్రెస్



నివాళులు అర్పిస్తున్న కాంగ్రెస్ నేతలు

తిరుపతి(వైద్యం): సామాజిక న్యాయం, సమానత్వం కోసం పాటుపడ్డ మహాత్ముడు జ్యోతీరావ్ పూలే అడుగుజాడల్లోనే నేటికీ కాంగ్రెస్ పార్టీ నడుస్తోందని ఆ పార్టీ నగర అధ్యక్షుడు గౌడపేరు చిట్టిబాబు అన్నారు. పూలే వర్ధంతి సందర్భంగా బాలాజీకాలనీ వద్ద ఉన్న ఆయన విగ్రహానికి గురువారం కాంగ్రెస్ నేతలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ కుల వివక్షకు వ్యతిరేకంగా పోరాటం సాగించిన గొప్ప వ్యక్తి జ్యోతీరావ్ పూలే అన్నారు. కాంగ్రెస్ నేతలు మురళీకృష్ణ, సుప్రజా, లోకేష్‌రెడ్డి, నరేంద్ర, స్వరూప్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

అణగారిన వర్గాల ఆశాజ్యోతి జ్యోతీరావ్ పూలే



పూలే చిత్రపటానికి నివాళులర్పిస్తున్న రవిప్రభు

తిరుపతి(వైద్యం): బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి పోరాటం చేసిన గొప్ప యోధుడు జ్యోతిరావ్ పూలే అని రుయా సూపరింటెండెంట్ రవిప్రభు అన్నారు. రుయాస్పత్రిలో సిబ్బందితో కలిసి గురువారం పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ కుల వివక్షను అణచి వేయడంలో కృషి చేసిన గొప్ప వ్యక్తి పూలే అని కొనియాడారు. సీఎస్ఆర్ఎంవో శ్రీనివాస్, ఏడీ దాక్షాయణిదేవి, ఏఆర్ఎంవో హరికృష్ణ, ఏవో రమేష్, ఏపీ హంస జిల్లా అధ్యక్షుడు రాజా, ఏపీ ఎన్జీవోస్ జిల్లా ఉపాధ్యక్షుడు వరప్రసాద్, రఘు, సూర్యకుమార్, జనార్దన్ పాల్గొన్నారు.

బీజేపీ ఆధ్వర్యంలో...



నివాళి అర్పిస్తున్న బీజేపీ నాయకులు

తిరుపతి(విద్య): జ్యోతిరావుపూలేకు బీజేపీ నాయకులు ఘన నివాళి అర్పించారు. బాలాజీకాలనీలోని ఆయన విగ్రహానికి పుష్పాంజలి ఘటించారు. గుండాల గోపీనాథరెడ్డి, సుబ్రహ్మణ్యంయాదవ్, చంద్రబాబుయాదవ్, సుబ్బుయాదవ్, సవిత, తొండమనాటి సుబ్రహ్మణ్యం, దీపక్‌యాదవ్, టీడీపీ నాయకులు హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.

పూలే ఆశయాలను అమలు చేస్తున్న బాబు: టీడీపీ



తిరుపతి: మహాత్మ జ్యోతిరావు పూలే ఆశయాలను, ఆలోచనలను ఆచరణలో అమలు చేస్తున్న ఘనత సీఎం చంద్రబాబుకు దక్కుతుందని రాష్ట్ర నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ రుద్రకోటి సదాశివం చెప్పారు. పూలే 134వ వర్ధంతిని పురస్కరించుకుని బాలాజీ కాలనీలోని ఆయన విగ్రహానికి పూలమాలవేసి అంజలి ఘటించారు. బీసీల అభ్యున్నతికి అలుపెరుగని కృషి చేస్తున్న చంద్రబాబు చరిత్రలో నిలిచిపోతారన్నారు. కార్యక్రమంలో రజక కార్పొరేషన్ డైరెక్టర్లు మధు, కరాటే చంద్ర, కూటమి నేతలు సింగంశెట్టి సుబ్బరామయ్య, గుండాల గోపినాథ్, లక్ష్మయ్య, అశోక్ సుధా తదితరులు పాల్గొన్నారు.

నేడు సూక్ష్మ కవితలు పుస్తకావిష్కరణ సభ

తిరుపతి (విశ్వవిద్యాలయాలు) నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): ఎస్వీయూ తెలుగు విశ్రాంతాచార్యులు ఎస్టీడీ చంద్రశేఖర్ రాసిన సూక్ష్మ కవితలు పుస్తకావిష్కరణ సభ శుక్రవారం ఎస్వీయూలో జరగనుంది. ఉదయం 10 గంటలకు తెలుగు విభాగంలోని ఆచార్య జీఎన్ రెడ్డి సెమినార్ హాల్లో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. ఈ తరం కవితా వేదిక - తెలుగు విభాగం సంయుక్తంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టనున్నాయి. తెలుగు విభాగాధిపతి ఆచార్య రాజేశ్వరమ్మ అధ్యక్షతన జరిగే ఈ సభలో ఆచార్య ఎస్టీడీ చంద్రశేఖర్, విశ్రాంతాచార్యులు మేడిపల్లి రవికుమార్, తోట వెంకటేశ్వర్లు, విశ్రాంతాచార్యులు పేట శ్రీనివాసులురెడ్డి పాల్గొంటారు. ఈ మేరకు ఎస్వీయూ తెలుగు విభాగాధిపతి ఆచార్య రాజేశ్వరమ్మ తెలిపారు.

16న పడమటిగాలి నాటకం

తిరుపతి(ఎమ్మార్‌పల్లె), నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): తిరుపతి మహతి కళాక్షేత్రంలో డిసెంబరు 16న పడమటి గాలి నాటకం ప్రదర్శిస్తున్నట్లు నాటక రచయిత పాటిబండ్ల ఆనందరావు తెలిపారు. ప్రెస్‌క్లబ్‌లో గురువారం ఆయన మాట్లాడుతూ అమెరికా వంటి దేశాలలో ఈ నాటకం ప్రజల మన్ననలు పొందిందని వివరించారు. రిటైర్డ్ ఐఏఎస్ అధికారి బలరామయ్య ఈ నాటకంలో ప్రధాన ప్రాత పోషించారని చెప్పారు. ఈ నాటకాన్ని ఉచితంగా ప్రదర్శిస్తున్నామని, నగర వాసులు తిలకించి విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో తెలుగు భాషోద్యమ సమితి అధ్యక్షుడు డాక్టర్ తమటం రామచంద్రారెడ్డి, ప్రధాన కార్యదర్శి ఆకుల మల్లేశ్వరరావు, కార్యవర్గ సభ్యులు డాక్టర్ నాదెండ్ల శ్రీమన్నారాయణ, ధర్మయ్య పాల్గొన్నారు.

సీఎంను కలిసిన భానుప్రకాష్‌రెడ్డి



ముఖ్యమంత్రితో మాట్లాడుతున్న భానుప్రకాష్‌రెడ్డి

తిరుపతి(ఉపాధ్యాయనగర్), నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబును టీటీడీ ధర్మకర్తల మండలి సభ్యుడు భానుప్రకాష్‌రెడ్డి గురువారం కలిశారు. సోదరుడు రామ్మూర్తి నాయుడు కర్మక్రియలకు నారావారిపల్లెకు వచ్చిన సందర్భంగా కలిసి సంతాపం తెలియజేశారు. శ్రీవారి భక్తులకు మరింత మెరుగైన సేవలు అందించేందుకు తనవద్ద ప్రణాళిక ఉందని, అందుకు సహకరించాలని సీఎంను అభ్యర్థించారు.

డ్రైవర్లు జాగ్రత్తగా ఉండాలి



శిక్షణ పూర్తిచేసుకున్న డ్రైవర్లతో ఆర్టీవో మురళీమోహన్

తిరుపతి(ఆర్టీసీ), నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): డ్రైవర్ల చేతిలో ప్రయాణికుల ప్రాణాలు ఉంటాయని, నిత్యం జాగ్రత్తగా ఉండాలని ఆర్టీవో మురళీమోహన్ అన్నారు. గురువారం ఉదయం అలిపిరి ఆర్టీసీ డిపో, గ్యారేజీ సముదాయంలోని శిక్షణ కేంద్రంలో జరిగిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. హేవీ డ్రైవింగ్ లైసెన్స్ శిక్షణ పూర్తిచేసుకున్న వారికి సర్టిఫికెట్స్ అందజేశారు. ఆయన మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలు డ్రైవర్ల నిర్లక్ష్యం మూలంగానే జరుగుతున్నాయని, ప్రతినిత్యమూ 15 నిమిషాలు ధ్యానం చేయడం వల్ల మనసుకు ప్రశాంతత లభిస్తుందని అన్నారు. డిపో మేనేజర్ హరిబాబు మాట్లాడుతూ వాహనాల కండిషన్‌ను ఎప్పటికప్పుడు తనిఖీ చేసుకోవాలన్నారు.

సీపీఎం జిల్లా మహాసభలను జయప్రదం చేయండి



పోస్టర్లు విడుదల చేస్తున్న నేతలు

తిరుపతి(ఆటోనగర్), నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : సత్యవేడులో డిసెంబరు ఒకటి, రెండు తేదీల్లో నిర్వహించే సీపీఎం తిరుపతి జిల్లా 14వ మహాసభలను జయప్రదం చేయాలని ఆ పార్టీ నగర కార్యదర్శి వేణుగోపాల్ కోరారు. గురువారం యశోదనగర్‌లోని పార్టీ కార్యాలయంలో మహాసభల పోస్టర్లు విడుదల చేశారు. మహాసభలకు సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు, మాజీ కార్యదర్శి పి.మధు, సీనియర్ నాయకులు హాజరుకానున్నట్లు తెలిపారు. నాయకులు ఎం.నరేంద్ర, పి.బుజ్జి, ఏ.రాధాకృష్ణ, ఎం.జయంతి, ఎం.రాజు పాల్గొన్నారు.

శ్రీవారిమెట్టు వ్యాపారుల సమస్యలు పరిష్కరించండి



మాట్లాడుతున్న కందారపు మురళి

తిరుపతి(ఆటోనగర్), నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): శ్రీవారిమెట్టు మార్గంలో చిరు వ్యాపారాలు చేసుకునే వారి సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కందారపు మురళి డిమాండ్ చేశారు. ఈ మేరకు కె.టి.రోడ్డులోని టీటీడీ పరిపాలన భవనం ఎదుట 100 రోజుల నుంచి రిలే నిరాహార దీక్షలు చేస్తున్న వ్యాపారులకు ఆయన గురువారం సంఘీభావం తెలిపారు. వంటావార్పుతో నిరసన తెలిపారు. మురళి మాట్లాడుతూ ఈ మార్గంలో కొన్నేళ్లుగా 30 కుటుంబాల వారు వ్యాపారాలు చేసుకుని జీవిస్తున్నారని చెప్పారు. టీటీడీ అధికారులు వారిని అడ్డుకోవడం వల్ల కుటుంబాలు వీధినపడే పరిస్థితి నెలకొందన్నారు. నూతన పాలకమండలి దీనిపై దృష్టి సారించి, సమస్యలు పరిష్కరించాలని కోరారు. లేనిపక్షంలో ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎస్.జయచంద్ర, ఐద్వా జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ పి.సాయిలక్ష్మి, బాలసుబ్రమణ్యం, శివకుమార్, భాస్కర్, వేణుగోపాల్, బుజ్జి పాల్గొన్నారు.

భక్తులకు అన్నదానం



తిరుపతి అర్బన్, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): కొంకా వీధిలోని సాయిబాబా మందిరంలో విగ్రహం ప్రతిష్ఠించి పాతికేళ్లు పూర్తయిన సందర్భంగా వెయ్యిమంది భక్తులకు అన్నదానం చేశారు. ఉదయం, సాయంత్రం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. విశేష అలంకరణల అనంతరం భక్తులకు దర్శనం కల్పించారు. సాయిబాబా సేవా సమాజ్ ప్రతినిధులు మబ్బు దేవనారాయణరెడ్డి, కడితి సుబ్రహ్మణ్యం, దుగ్గం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీఏ కార్యాలయానికి క్యూ

తనిఖీలతో లైసెన్స్‌ల కోసం ఎగబడుతున్న వాహనదారులు



తిరుపతి ఆర్టీఏ కార్యాలయంలో ఎల్ఎల్ఆర్ పరీక్ష కోసం వేచి ఉన్న అభ్యర్థులు (ఫైల్ ఫొటో)

తిరుపతి (రవాణా), నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): రవాణా శాఖ (ఆర్టీఏ) అధికారులు, పోలీసులు ఇటీవల వాహన తనిఖీలు ముమ్మరం చేశారు. లైసెన్స్ లేని వారికి భారీగా జరిమానా విధిస్తున్నారు. కొందరిపై కేసులు నమోదు చేస్తున్నారు. ఈ క్రమంలో లైసెన్స్‌ల కోసం వాహనదారులు ఆర్టీఏ కార్యాలయాలకు క్యూ కడుతున్నారు. లైసెన్స్ పొందాలంటే మొదటగా ఆన్‌లైన్‌లో ఎల్ఎల్ఆర్ స్లాట్ బుక్ చేసుకోవాలి. స్లాట్‌లో వచ్చిన తేదీన ఆర్టీఏ కార్యాలయంలో కంప్యూటర్ టెస్టుకు హాజరుకావాలి. అందులో పాస్ అయితేనే డ్రైవింగ్ లైసెన్స్ టెస్ట్‌కు అర్హత సాధిస్తారు. ఎల్ఎల్ఆర్ టెస్ట్ పాసైన నెల రోజుల తర్వాత డీఎల్ స్లాట్ బుక్ చేసుకునే వెలుసుబాటు ఉంటుంది. ఎల్ఎల్ఆర్ ధ్రువపత్రం పొందిన తేదీ నుంచి 5 నెలల వరకు మాత్రమే డీఎల్ స్లాట్ బుక్ చేసుకునేందుకు వెలుసుబాటు ఉంటుంది. అదే తరహాలో డీఎల్ పరీక్షకు హాజరైన అభ్యర్థులు ట్రాక్‌లో నియమ నిబంధనలకు అనుగుణంగా డ్రైవింగ్ చేయడంతో లైసెన్సుకు అర్హత సాధిస్తారు. లైసెన్స్‌లు పొందేందుకు రవాణా శాఖలో రోజుకు ఎల్ఎల్ఆర్ స్లాట్లు 60 మాత్రమే (ఒక్కో కార్యాలయంలో) అందుబాటులో ఉంటాయి. దీంతో ఎల్ఎల్ఆర్ స్లాట్‌కు డిమాండ్ పెరిగింది.

పెండింగ్ జీతాలు చెల్లించాలి



ఆందోళన చేస్తున్న పారిశుధ్య కార్మికులు

తిరుపతి(వైద్యం), నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): పారిశుధ్య కార్మికులకు మూడు నెలలుగా పెండింగ్‌లో ఉన్న జీతాలను వెంటనే చెల్లించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి మురళి డిమాండ్ చేశారు. రుయాస్పత్రిలో పని చేసే పారిశుధ్య కార్మికులకు మూడు నెలలుగా జీతాలు ఇవ్వకపోవడంపై ఏఐటీయూసీ ఆధ్వర్యంలో గురువారం రుయాస్పత్రి పరిపాలనా భవనం ముందు ఆందోళనకు దిగారు. మురళి మాట్లాడుతూ కార్మికులకు జీతాలు సక్రమంగా ఇవ్వకుండా ఇబ్బందులకు గురిచేస్తున్న ఏజెన్సీ నిర్వాహకులపై తక్షణమే చర్యలు తీసుకోవాలన్నారు. మూడేళ్లుగా కార్మికులకు ఈఎస్ఐ, పీఎఫ్ వంటివి చెల్లించకుండా శ్రమను దోచుకుంటున్నారని మండిపడ్డారు. నిబంధనల మేరకు కార్మికులను నియమించకుండా తక్కువ మందితో ఎక్కువ పని చేయిస్తున్నారని మండిపడ్డారు. కార్మికులకు న్యాయం చేయకపోతే పెద్ద ఎత్తున పోరాటానికి దిగాల్సి వస్తుందని హెచ్చరించారు. జీతాలు, ఈఎస్ఐ, పీఎఫ్ వంటివి ఇవ్వకుండా అధికారులను తప్పుదోవ పట్టించిన ఏ-1 ఏజెన్సీ నిర్వాహకుడు రవికుమార్‌పై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని సూపరింటెండెంట్ రవిప్రభు తెలిపారు. కార్మికులకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నేతలు రాజా, శివ, వైఎస్ మణి, సీహెచ్ శివకుమార్, గోవిందస్వామి, శ్రీనివాసులు పాల్గొన్నారు.

టీచర్లపై పని ఒత్తిడి తగదు

తిరుపతి(విద్య), నవంబరు 28(ఆంధ్రజ్యోతి): టీచర్లపై పని ఒత్తిడి తగ్గించాలని ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం(ఆపస్) రాష్ట్ర అధ్యక్షుడు శవన్నగారి బాలాజీ, ప్రధాన కార్యదర్శి జి.వి.సత్యనారాయణ గురువారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. కొత్త ప్రభుత్వం టీచర్లపై పని ఒత్తిడి పెంచి, వేధిస్తోందన్నారు. రెసిడెన్షియల్ ట్రైనింగ్‌లను ఉపాధ్యాయ సంఘాలు వ్యతిరేకిస్తున్నా వినిపించుకోవడం లేదన్నారు. గతంలో ఓ టీచర్ మృతిచెందినా మళ్లీ సుదూర ప్రాంతాల్లోనే రెసిడెన్షియల్ ట్రైనింగ్‌లు ఏర్పాటు చేయడం సమంజసం కాదన్నారు. తాజాగా విజయనగరం జిల్లాలో మరో ఉపాధ్యాయుడిని కోల్పోవాల్సి వచ్చిందన్నారు. పని గంటలు పెంచడం, సెలవులను 10శాతానికి పరిమితం చేయడం, బయోమెట్రిక్ పేరుతో మెమోలు ఇచ్చి బెదిరించడం దారుణమన్నారు. ఇకనైనా తీరు మార్చుకుని ఉపాధ్యాయులు ప్రశాంతంగా బోధన చేసుకునే విధంగా నిర్ణయాలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

ఆకట్టుకున్న జీవ వైవిధ్య ఫొటో ప్రదర్శన



మీడియాతో మాట్లాడుతున్న శివహర్ష

తిరుపతి(నేరవిభాగం), నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): ప్రాంతీయ పాస్‌పోర్టు కార్యాలయం ఆధ్వర్యంలో తిరుపతి పాస్‌పోర్టు సేవా కేంద్రంలో గురువారం ఏర్పాటు చేసిన జీవవైవిధ్య ఫొటో ప్రదర్శన ఆకట్టుకుంది. రీజనల్ పాస్‌పోర్టు అధికారి శివహర్ష హాజరై ప్రజలకు పాస్‌పోర్టు సేవలు మరింత మెరుగ్గా అందించడంతో పాటు జీవ వైవిధ్యంపై అవగాహన కల్పిస్తున్నట్లు చెప్పారు. ఫారెస్టు కన్జర్వేటర్ సెల్వం మాట్లాడుతూ నగరంలో శేషాచలం అడవులు, చంద్రగిరి కోట, మాల్వాడి గుండం జలపాతాలు, జంతు ప్రదర్శన శాలలతో సహా ఎన్నో పర్యాటక ప్రాంతాలు ఉన్నాయని, వాటిని ప్రతిబింబించేలా ఫొటో ఎగ్జిబిషన్ ఉందని కొనియాడారు.

మర్చిపోయిన బ్యాగు అప్పగింత



భక్తుడికి బ్యాగు అందజేస్తున్న రిసెప్షన్ అధికారులు

తిరుమల, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): అతిథిగృహం వద్ద భక్తుడు మర్చిపోయిన బ్యాగును తిరిగి అప్పగించారు. చెన్నైకు చెందిన సెల్వరాజు శ్రీవారి దర్శనార్థం గురువారం తిరుమలకు వచ్చారు. దర్శనానికి వెళ్లే ముందు గోవిందసాయి కౌంటర్ వద్ద టీ తాగారు. ఈ క్రమంలో బ్యాగును అక్కడే మర్చిపోయి వెళ్లిపోయారు. విధి నిర్వహణలో ఉన్న జూనియర్ అసిస్టెంట్ రెడ్డి భాస్కర్ దాన్ని గుర్తించి పద్మావతి విచారణ కార్యాలయ సూపరింటెండెంట్ భాస్కర్‌కు అందజేశారు. తర్వాత బ్యాగు పోయిందంటూ వచ్చిన భక్తుడు సెల్వరాజు నుంచి వివరాలు సేకరించిన తర్వాత బ్యాగును తిరిగి అప్పగించారు.

పేదలకు అన్నదానం



అన్నదానం చేస్తున్న జయచంద్రారెడ్డి

తిరుపతి (జీవకోన), నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): వైసీపీ నగర మాజీ ప్రధాన కార్యదర్శి జి.మోహన్‌బాబు రాయల్ ప్రథమ వర్ధంతిని పురస్కరించుకుని గురువారం తుడా కార్యాలయ కూడలిలో టౌన్‌బ్యాంకు చైర్మన్ కేతం జయచంద్రారెడ్డి ఆధ్వర్యంలో పేదలకు అన్నదానం చేశారు. కార్పొరేటర్లు పుల్లూరు అమరనాథరెడ్డి, మునిరామిరెడ్డి, కోఆపరేటివ్ బ్యాంకుడైరెక్టర్లు నాదముని, బ్రహ్మానందరెడ్డి, మాకం చంద్రయ్య, అమరనాథ్, సురేష్, కాసిం, నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చెత్త తరలింపుపై సమీక్ష



వినాయకసాగర్ వద్ద చెత్త తరలింపు కేంద్రాన్ని పరిశీలిస్తున్న కమిషనర్ మౌర్య

తిరుపతి (జీవకోన), నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : నగరంలో చెత్త తరలింపుపై కమిషనర్ మౌర్యా గురువారం సమీక్షించారు. ముందుగా వినాయకసాగర్ సమీపంలోని చెత్త తరలింపు కేంద్రాన్ని పరిశీలించారు. ఎన్ని వాహనాలు వస్తున్నాయి...ఒక్కో వాహనంలో ఎంత చెత్తను సేకరిస్తున్నారు... వాహనాల కండిషన్ తదితరాలపై ఆరా తీశారు. డ్రైవర్లు, సిబ్బంది హాజరు నమోదు, వాహనాల రాకపోకల రిజిస్టర్‌ను పరిశీలించారు. తూకివాకం వద్ద ఉన్న చెత్త నిర్వహణ కేంద్రానికి రోజువారీ ఎంత చెత్త తరలిస్తున్నారు.. ప్లాంట్ నిర్వహణపై సమీక్షించారు. సమావేశంలో అదనపు కమిషనర్ చరణ్‌తేజ్‌రెడ్డి, ఎస్ఈ శ్యాంసుందర్, ఎంఈలు తులసీకుమార్, గోమతి, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, రెవెన్యూ ఆఫీసర్ సేతుమాధవ్, డీఈలు పాల్గొన్నారు.

శ్మశాన స్థలంపై విచారణ



విచారణ జరుపుతున్న ఫారెస్ట్, పోలీసు అధికారులు

తిరుపతి (జీవకోన), నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): నగర పరిధిలోని తిమ్మినాయుడు పాళెం హరిజనవాడ సమీపంలో ఉన్న శ్మశాన స్థల విషయంపై గురువారం హైకోర్టు ఉత్తర్వుల మేరకు ఫారెస్ట్, పోలీసు అధికారులు విచారణ చేపట్టారు. తమ లే అవుట్‌కు ఆనుకుని ఉన్న రిజర్వ్ ఫారెస్ట్ స్థలాన్ని శ్మశానంగా వినియోగిస్తున్నారని స్థానికులు కోర్టుకు వెళ్లారు. దీనిపై అధికారులు స్థానికులను, హరిజనవాడవాసులను విచారించారు. హరిజనవాడకు శ్మశాన స్థలం లేదని, అందుకే సమీపంలోని ఫారెస్ట్ స్థలంలో చనిపోయిన వారిని ఎన్నో సంవత్సరాలుగా ఖననం చేస్తున్నామని తెలిపారు. ఇరువర్గాలను విచారించిన అధికారులు కోర్టుకు నివేదిక అందజేస్తామని పేర్కొన్నారు. ఫారెస్ట్ సబ్ డీఎఫ్‌వో నాగభూషణం, అలిపిరి పోలీసులు పాల్గొన్నారు.











అంగరంగ వైభవం అమ్మవారి బ్రహ్మోత్సవం

సకల దేవతలు అతిథులుగా రాగా, అఖిల జనకోటి ఆనందపరవశం కాగా ఎగిరింది ధ్వజపటం. ఎగసింది జయ జయధ్వానం. బ్రహ్మండ నాయకుడి ప్రియదేవకి పద్మావతిదేవి కార్తీక బ్రహ్మోత్సవాలు తిరుచానూరులోవైభవంగా మొదలయ్యాయి. టీటీడీ కళాబృందాల సాంస్కృతిక ప్రదర్శనలు భక్తకోటికి ఆకట్టుకున్నాయి. ప్రకృతి రమణీయత ఉట్టిపడేలా ఏర్పాటు చేసిన ఫల, పుష్ప ప్రదర్శన యాత్రికుల మనసు దోచుకుంది.

- తిరుచానూరు, ఆంధ్రజ్యోతి

తిరుచానూరు పద్మావతి అమ్మవారి కార్తీక బ్రహ్మోత్సవాలు గురువారం ఉదయం ధ్వజారోహణంతో అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. తొమ్మిది రోజుల పాటూ జరిగే ఉత్సవాలు విజయవంతమయ్యేందుకు ధ్వజస్తంభం ఎదుట అర్చకులు పూజలు చేసి సకల దేవతామూర్తులను ఉత్సవాలకు ఆహ్వానించి దిగ్బంధనం చేశారు. ఉదయం 6.30 గంటలకు చక్రాత్తాళ్వార్ ముందు సాగగా వెనుకనే అమ్మవారికి అభిముఖంగా గజ చిత్రపటాన్ని తిరువీధుల్లో ఊరేగిస్తూ ఆలయానికి తీసుకొచ్చారు. యాగశాల నుంచి మొలకెత్తిన నవధాన్యాలను ధ్వజస్తంభం ముందు ఉంచి పూజలు చేశారు. అనంతరం ధ్వజస్తంభంపై ఉన్న గజప్రతిమకు సుగంద పరిమళ ద్రవ్యాలతో స్నపన తిరుమంజనం నిర్వహించారు. బ్రహ్మోత్సవాల ప్రారంభసూచికగా గురువారం ఉదయం 9.30 గంటలకు ధ్వజారోహణం చేశారు. అదే సమయంలో అమ్మవారి మూలమూర్తికి ప్రత్యేక పూజలు చేసి నైవేద్యం సమర్పించారు. కంకణభట్టారు శ్రీనివాసచార్యులు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఆయా కార్యక్రమాల్లో జీయర్‌స్వాములు, టీటీడీ ఈవో శ్యామలరావు, జేఈవో వీరబ్రహ్మం, ఆలయ డిప్యూటీ ఈవో గోవిందరాజన్, ఏఈవో దేవరాజులు, ఏవీఎస్వో సతీష్‌కుమార్, సూపరింటెండెంట్లు రమేష్, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్, సుబ్బరాయుడు, సుభాస్కరనాయుడు పాల్గొన్నారు.

కానుకగా గొడుగులు

చెన్నైకి చెందిన వీర్ వసంత్‌కుమార్ గురువారం ఆరు గొడుగులను అమ్మవారి ఆలయానికి కానుకగా అందించారు. టీటీడీ ఈవో శ్యామలరావుకి భక్తులు ఆలయం వద్ద అందజేశారు.

బ్రహ్మోత్సవాల్లో నేడు

ఉదయం 8 గంటలకు పెద్దశేష వాహనం
మధ్యాహ్నం 12.30 గంటలకు స్నపన తిరుమంజనం
సాయంత్రం 5.30 గంటలకు ఊంజల్ సేవ
రాత్రి 7 గంటలకు హంసవాహనం

ఫల పుష్ప సోయగం

తిరుచానూరులోని అమ్మవారి శుక్రవారపు తోటలో టీటీడీ ఉద్యానశాఖ ఏర్పాటు చేసిన ఫలపుష్ప ప్రదర్శన భక్తులకు కనువిందు చేస్తోంది. ఈ ప్రదర్శనను టీటీడీ ఈవో శ్యామలరావు, జేఈవో వీరబ్రహ్మం కలిసి ప్రారంభించారు. పురాణ గాథలకు సంబంధించి ఏర్పాటు చేసిన వివిధ ఘట్టాల ప్రదర్శనలు విశేషంగా నిలుస్తున్నాయి. వివిధ పుష్పాలు, కూరగాయలతో ఏర్పాటు చేసిన జంతువులు, పక్షుల ఆకృతులు భక్తులను విశేషంగా ఆకర్షించాయి. ఉద్యానవనశాఖ డిప్యూటీ డైరెక్టర్ శ్రీనివాసులు నేతృత్వంలో ఫల, పుష్ప ప్రదర్శనశాల అద్భుతంగా తీర్చిదిద్దారు. మైసూరుకు చెందిన గౌరి గత 9 సంవత్సరాలుగా సైకత శిల్పాన్ని తయారు చేస్తున్నారు. ఈ ఏడాది పద్మావతి సమేత వేంకటేశ్వరస్వామి సైకత శిల్పాన్ని రూపొందించారు. అదే విధంగా ఎస్వీ ఆయుర్వేద కళాశాల ఆధ్వర్యంలో ఎక్స్‌పోఆయు, ఎస్వీ ఆయుర్వేద ఫార్మసీ ఆధ్వర్యంలో వనమూలికా ప్రదర్శన, ఉచిత ఆయుర్వేద వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. ఎస్వీ సంప్రదాయ ఆలయ శిల్ప శిక్షణ సంస్థ ఏర్పాటు చేసిన శిల్పకళ ప్రదర్శనశాల భక్తులను ఆకట్టుకుంది.



పట్టువస్త్రాల సమర్పణ




ప్రభుత్వం తరపున దేవదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి గురువారం సాయంత్రం అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించారు. ఆయనకు టీటీడీ ఈవో శ్యామలరావు, జేఈవోలు వీరబ్రహ్మం, గౌతమి, సీవీఎస్వో శ్రీధర్, అర్చకులు, అధికారులు స్వాగతం పలికారు. 'ఎమ్మెల్యేగా అమ్మవారి దర్శనానికి వచ్చిన నేను.. అమ్మవారి పేరిట ముద్రించిన పుస్తకాలను భక్తులకు పంపిణీ చేయాలని నాటి డిప్యూటీ ఈవోకు చెప్పాను. సమయం చాలదని, పక్కన పెట్టేసి పోండని నిర్లక్ష్యంగా చెప్పారాయన. ఇప్పుడా తల్లికి పట్టువస్త్రాలు సమర్పించే అవకాశం రావడం నా పూర్వజన్మ సుకృతం' అని అన్నారు

భక్తులకు సకల సౌకర్యాలు
టీటీడీ ఈవో శ్యామలరావు

అమ్మవారి బ్రహ్మోత్సవాలకు విచ్చేసే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని సదుపాయాలు ఏర్పాట్లు చేశామని టీటీడీ ఈవో శ్యామలరావు తెలిపారు. గురువారం తిరుచానూరులో ధ్వజారోహణం కార్యక్రమానికి వచ్చిన సందర్భంగా ఆయన మాట్లాడుతూ తిరుమల తరహాలో అమ్మవారి బ్రహ్మోత్సవాలను కూడా అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నామన్నారు. భక్తులు పెద్ద సంఖ్యలో భక్తులు మూలమూర్తితోపాటూ, వాహన సేవలను సంతృప్తిగా తిలకించేందుకు అన్ని ఏర్పాట్లు చేశామని చెప్పారు.

తిరుచానూరులో తిరుమల లడ్డూలు

అమ్మవారి బ్రహ్మోత్సవాలు తిలకించేందుకు వచ్చే భక్తులకు తిరుచానూరులోని ఆలయ ప్రాంగణంలోని లడ్డూ కౌంటర్‌లో తిరుమల లడ్డూలు కూడా విక్రయిస్తున్నారు. దర్శనానంతరం ఆలయం లోపల ఉన్న కౌంటర్లో లడ్డూ టికెట్లు ఇస్తారు. వాటితో బయటున్న కౌంటర్లో శ్రీవారి లడ్డూలు కొనుగోలు చేసుకోవచ్చు. రోజూ పదివేల తిరుమల లడ్డూలు తిరుచానూరులో అందుబాటులో ఉంచుతామని ఆలయ డిప్యూటీ ఈవో గోవింద రాజన్ తెలిపారు.



కత్తితో బెదిరించి దోపిడీయత్నం

మన్నారుపోలూరులో పట్టపగలే ఘటన ● అడ్డొచ్చిన మహిళను ఆటోలో వేసుకెళ్లేందుకు ప్రయత్నించిన దుండగులు

సూళ్లూరుపేట, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): అడ్రస్ కావాలంటూ అడిగారు. ఆపై కత్తితో బెదిరించి ఇంట్లో దోపిడీకి యత్నించారు. ఈ ఘటన సూళ్లూరుపేట మండలం మన్నారుపోలూరులో గురువారం మధ్యాహ్నం చోటుచేసుకుంది. బాధితులు తెలిపిన ప్రకారం.. మన్నారుపోలూరు చేనేత కాలనీలో నివాసం ఉంటున్న తాపీ కూలీ పూడి మునస్వామి గురువారం పనికి వెళ్లారు. ఇంట్లో ఆయన భార్య దేవి, కుమారుడు చందు ఉన్నారు. మధ్యాహ్నం ఒంటి గంట సమయంలో ముగ్గురు వ్యక్తులు వీరి ఇంటి పక్కనే రోడ్డులో ఆటో నిలిపారు. అందులో ఒకడు వీరి ఇంటికొచ్చి ఏదో అడ్రసు కావాలంటూ తమిళంలో అడిగాడు. ప్రహరీ అవతల నుంచి అడ్రసు చెబుతున్న దేవి.. బయట మరో ఇద్దరు ఉండటం.. ఇతడు మద్యం తాగి ఉన్నాడని గమనించారు. అదే సమయంలో ఇంట్లోనే ఉన్న కుమారుడు చందు బయటకు వచ్చి ఇక్కడ అటువంటి అడ్రసు లేదంటూ చెప్పారు. ఆ వెంటనే దుండగలు ఈ అడ్రసు మాకు తెలియదు చెప్పండంటూ బలవంతంగా ఆ ఇంట్లోకి వెళ్లి తలుపులు వేసి చందు మెడపై కత్తి పెట్టారు. అరిస్తే చంపేస్తామంటూ బెదిరించారు. పక్కనే ఉన్న దేవి కేకలు వేయడంతో పక్క ఇంట్లో ఉన్న వల్లూరు వెంకటమ్మ అరుస్తూ వెళ్లి తలుపులు కొట్టింది. దీంతో చుట్టుపక్కల వాళ్లు వచ్చారన్న భయంతో దుండగులు తలుపులు తీసి పారిపోయేందుకు ప్రయత్నించారు. అయితే, చుట్టుపక్కల ఎవరూ లేకపోవడంతో వెంకటమ్మను బలవతంగా ఆటో వద్దకు లాక్కెళ్లి బెదిరించారు. కాసేపు వారితో పెనుగులాడిన ఆమె తప్పించుకొని పరుగెడుతూ ఇంట్లోకి వెళ్లారు. అప్పుడే భోజనానికి వస్తున్న మునస్వామి ఏమి జరిగిదంటూ అరవడంతో దుండగులు ఆటోలో సూళ్లూరుపేట వైపు వెళ్లారు. వెంటనే బాధితులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు వెళ్లి వివరాలు తీసుకొన్నారు. ఆంధ్ర, తమిళనాడుకు సరిహద్దులో ఉండటంతో ఇలాంటి ఘటనలు తరచూ జరుగుతున్నాయి.



వివరాలు వెల్లడిస్తున్న బాధితులు దేవి, చందు

శ్రీవారి దర్శనానికి 12 గంటలు

తిరుమల, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 12 గంటల సమయం పడుతోంది. గురువారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 22 కంపార్టుమెంట్లలో సర్వదర్శన భక్తులు.. వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 7 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు. ఇక, మంగళవారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ బుధవారం లెక్కించింది. రూ.3.75 కోట్లు ఆదాయం లభించినట్టు గురువారం ఉదయం ప్రకటించింది. బుధవారం 67,626 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకోగా, 22,231 మంది భక్తులు శ్రీవారికి తలనీలాలు సమర్పించారు.

స్విమ్స్‌లో ఎమ్మెస్సీ కోర్సులకు స్పాట్ అడ్మిషన్లు

తిరుపతి(వైద్యం), నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): స్విమ్స్ యూనివర్సిటీలో ఎమ్మెస్సీ బయో టెక్నాలజీ, బయో ఇన్ఫర్మేటిక్స్ కోర్సులకు స్పాట్ అడ్మిషన్లు ఆహ్వానిస్తున్నట్లు ఇన్‌చార్జి రిజిస్ట్రార్ వనజాక్షి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 2024-25 సంవత్సరానికి సంబంధించి ఎమ్మెస్సీ బయోటెక్నాలజీ 1, బయో ఇన్ఫర్మేటిక్స్ 4 సీట్లు ఉన్నట్లు పేర్కొన్నారు. ఏపీ పీజీసెట్‌కు సంబంధం లేకుండా వీటిని భర్తీ చేస్తామని, అభ్యర్థులు ఈనెల 29న స్విమ్స్‌లో నిర్వహించే స్పాట్ అడ్మిషన్లకు ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరుకావాలని కోరారు. పూర్తి వివరాలకు స్విమ్స్ వెబ్‌సైట్‌ను సందర్శించాలని పేర్కొన్నారు.

రేపు స్వర్ణముఖి నదీ హారతులు

● రాహుకేతు పూజలు మినహా ఆర్జిత సేవల రద్దు

శ్రీకాళహస్తి, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయ ఆధ్వర్యంలో శనివారం స్వర్ణముఖిలో నదీహారతులు సమర్పించనున్నట్లు ఈవో బాపిరెడ్డి తెలిపారు. ఈనెల 30న శనివారం సాయంత్రం 7గంటలకు స్వర్ణముఖి నదీ తల్లికి కలశపూజలు, ధూప, దీప, నైవేద్యాలు, మహాదీపారాధన నిర్వహిస్తున్నట్లు తెలిపారు. భక్తులు వీక్షించడానికి ఏర్పాట్లు చేశామన్నారు. కాగా నదీహారతులను పురస్కరించుకుని ఆలయంలో రాహుకేతు పూజలు మినహా అన్ని ఆర్జిత సేవలు రద్దు చేసినట్లు ఈవో తెలిపారు.

ముక్కంటి ఆలయ అవుట్ సోర్సింగ్ ఉద్యోగి సస్పెన్షన్

శ్రీకాళహస్తి, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): ముక్కంటి ఆలయ అవుట్ సోర్సింగ్ ఉద్యోగి చంద్రయ్యను సస్పెండ్ చేస్తూ ఈవో బాపిరెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. ముక్కంటి ఆలయానికి అనుబంధంగా నిర్వహిస్తున్న జ్ఞానప్రసూనాంబిక నర్సింగ్ కళాశాల వ్యాన్ క్లీనర్‌గా చంద్రయ్య విధులు నిర్వహించాల్సి ఉంది. అయితే రెండు రోజుల క్రితం ముక్కంటి ఆలయంలో సంచరిస్తూ అడ్డదారిలో భక్తులను దర్శనానికి తీసుకెళ్తుండగా కొందరు అభ్యంతరం చెప్పడమే కాకుండా ఫిర్యాదు చేశారు. దీనిపై విచారణ చేపట్టిన ఈవో భక్తుల మనోభావాలు దెబ్బతీసేలా అడ్డదారిలో దర్శనానికి తీసుకెళ్లినట్టు గుర్తించారు. అలాగే గతంలో హుండీ లెక్కింపు సందర్భంగా చోరీకి పాల్పడి చంద్రయ్య జైలుకు వెళ్లివచ్చినట్లుగా గుర్తించారు. ఈ మేరకు అడ్డదారిలో భక్తులను దర్శనానికి అనుమతించడంపై సస్పెండ్ చేశారు.

ప్రియుడ్ని కిడ్నాప్ చేయించింది!

● తిరుపతిలో కలకలం
● గంట వ్యవధిలోనే పట్టుకున్న పోలీసులు

తిరుపతి, (నేరవిభాగం), నవంబరు 28(ఆంధ్రజ్యోతి): తనను సరిగా చూడటం లేదని ప్రియురాలే ప్రియుడ్ని కిడ్నాప్ చేయించింది. ఈ ఘటన గురువారం తిరుపతిలో కలకలం రేపింది. గంట వ్యవధిలోనే పోలీసులు నిందితులు, బాధితుడిని పట్టుకోగలిగారు. తిరుపతి ఈస్ట్ సీఐ రామకృష్ణ తెలిపిన ప్రకారం.. చిత్తూరు జిల్లా పెనుమూరుకు చెందిన నాని తిరుపతి పెద్దకాపులేఅవుట్‌లో ఒక లాడ్జిని లీజుకు తీసుకున్నారు. ఇతడికి వివాహం కాలేదు. ఈ క్రమంలో మదనపల్లెకు చెందిన భాను.. భర్త చనిపోవడంతో తిరుపతికి వచ్చి చిన్నచిన్న పనులు చేసుకుంటున్నారు. ఈమె ఏడాద కిందట భానుకు పరిచయమైంది. వీరిద్దరూ కలిసి పెద్దకాపు లేఅవుట్‌లో ఉంటున్నారు. మూడు నెలలుగా తనను సరిగా పట్టించుకోక పోవడంతో ఆగ్రహించిన భాను.. మదనపల్లె నుంచి నలుగురు రౌడీలను రప్పించింది. లాడ్జిలో ఉన్న నానిని కిడ్నాప్ చేయించి మదనపల్లెకు తీసుకెళుతున్నారు. వాహనంలో అతడిని చిత్రహింసలకు గురిచేసినట్లు సమాచారం. కిడ్నాప్ సమాచారం తెలిసిన వెంటనే డీఎస్పీ వెంకటనారాయణ, సీఐ రామకృష్ణ, రక్షక్ బృందాలను ఎస్పీ సుబ్బరాయుడు అప్రమత్తం చేశారు. నాని మొబైల్ నెంబరు ఆధారంగా వాహనాన్ని గుర్తించారు. వాయల్పాడు వద్ద ప్రత్యేక బృందాలు వాహనం ఆపి కిడ్నాపర్లతో పాటు నానిని అదుపులోకి తీసుకుని తిరుపతికి తీసుకొస్తున్నారు. బాధితుడి ఫిర్యాదు మేరకు సీఐ రామకృష్ణ కేసు నమోదు చేశారు. ఈ క్రమంలో కిడ్నాపర్లను, బాధితుడ్ని విచారించి జరిగిన ఘటనపై దర్యాప్తు చేయనున్నారు.

మంచి రోజు చూసుకుని రండి

● కళంకిత కార్పొరేటర్లను పక్కన పెట్టండి
● టీడీఆర్ స్కాం, భూ కబ్జాలు, కూటమి నేతలపై దౌర్జన్యాలు చేసిన నేతలొద్దు
● ఇన్‌చార్జి మంత్రి అనగాని సూచన

తిరుపతి, నవంబరు28(ఆంధ్రజ్యోతి): కళంకిత కార్పొరేటర్లను పక్కన పెట్టి, తక్కినవారిని పార్టీలో చేర్చుకునేందుకు అధిష్ఠానం గ్రీన్ సిగ్నల్ ఇచ్చిందని జిల్లా ఇన్‌చార్జి మంత్రి అనగాని సత్యప్రసాద్ తెలిపినట్టు తెలిసింది. మంచి రోజు చూసుకుని పార్టీలో చేరేందుకు రావాలని సూచించినట్లు సమాచారం. మున్సిపల్ ఎన్నికల చట్ట సవరణ నేపథ్యంలో వైసీపీ కార్పొరేటర్లు కూటమి పార్టీలో చేరేందుకు టీసీ నేత అన్నా రామచంద్రయ్య, వైసీపీ సీనియర్ నేత దొడ్డారెడ్డి సిద్దారెడ్డి నేతృత్వంలో ఇటీవల 10 మందికి పైగా కార్పొరేటర్లు విజయవాడకు వెళ్లి ఇన్‌చార్జి మంత్రి అనగాని సత్యప్రసాద్‌ను కలిసిన విషయం తెలిసిందే. తిరుపతికి వచ్చినప్పుడు పార్టీలోకి చేరేందుకు సన్నాహాలు చేసుకోమని మంత్రి చెప్పిన నేపథ్యంలో పలువురు కార్పొరేటర్లు ఆయన్ను కలిశారు. ఈ సందర్భంగా మంత్రి దిశా నిర్దేశం చేసినట్టు సమాచారం. టీడీఆర్ బాండ్ల కుంభకోణం, భూకబ్జాలు, కూటమి నేతలపై దౌర్జన్యాలు చేసిన వైసీపీ నేతలను పార్టీలోకి తీసుకోవద్దని చెప్పినట్లు తెలియవచ్చింది. పార్టీ అధిష్ఠానం ఇప్పటికే పలువురు కార్పొరేటర్ల గురించి ఆరాతీసిందని, వారిపై సానుకూలమైన నివేదిక వచ్చిందన్న చర్చ జరిగినట్టు సమాచారం. అలాంటివాళ్లను పార్టీలోకి తీసుకునే ఏర్పాట్లు చేసుకోవాలని చెప్పినట్టు తెలిసింది.

బీసీల సంక్షేమానికి రూ.39వేల కోట్లు

● ఈ ఘనత సీఎం చంద్రబాబుకే దక్కిందన్న మంత్రి సవిత

తిరుపతి (కలెక్టరేట్), నవంబరు28 (ఆంధ్రజ్యోతి): బీసీల సంక్షేమానికి రూ.39వేల కోట్లను కేటాయించిన ఘనత సీఎం చంద్రబాబుకే దక్కిందని మంత్రి ఎస్.సవిత అన్నారు. మహాత్మా జ్యోతిరావు పూలే వర్ధంతి సందర్భంగా గురువారం తిరుచానూరులోని ఓ హోటల్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె పూలే చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. బడుగు, బలహీన వర్గాల ప్రజలు విద్యావంతులు కావాలనే ఉద్దేశంతో ఆ రోజుల్లోనే మహాత్మా జ్యోతి బాపూలే పోరాడారని ఆమె గుర్తు చేశారు. 70 నుంచి 80 శాతం పనులు పూర్తయిన బీసీ వసతి గృహాలు, రెసిడెన్షియల్ హాస్టళ్లను త్వరలో పూర్తి చేయనున్నామని తెలిపారు. బీసీలను ఔత్సాహిక పారిశ్రామికవేత్తలుగా తయారు చేయడానికి చర్యలు చేపడుతున్నామన్నారు. బీసీ స్టడీ సర్కిల్ ద్వారా నిరుద్యోగ యువతకు ఉచిత శిక్షణను ప్రారంభించామని, త్వరలో ఆన్‌లైన్ ద్వారా కూడా శిక్షణ ఇవ్వనున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా బీసీ సంక్షేమ, సాధికార అధికారి చంద్రశేఖర్, బీసీ సంక్షేమశాఖ అధికారులు, ప్రతినిధులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



పూలే చిత్రపటానికి పుష్పాంజలి ఘటిస్తున్న మంత్రి సవిత



రామ్మూర్తి నాయుడి కర్మక్రియల్లో పాల్గొనేందుకు వచ్చిన బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి, టీటీడీ సభ్యుడు భానుప్రకాష్‌రెడ్డి - డిప్యూటీ స్పీకరు రఘురామకృష్ణరాజు - మాజీ ఐఏఎస్ అధికారి లక్ష్మీనారాయణ - నందమూరి మోహనకృష్ణ, రూప, నందమూరి సుహాసిని

నారావారిపల్లెలో ప్రముఖుల సందడి





సీఎం చంద్రబాబుతో టీటీడీ అదనపు ఈవో వెంకన్న చౌదరి - నారా చిన్నబ్బనాయుడు కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న చంద్రబాబు - సీఎం రిలీఫ్ ఫండ్‌కు రూ.1,00116 చెక్కు అందజేస్తున్న రైతులు - మంత్రి లోకేశ్‌కు వినతుల అందజేత

'గంగ' కోసం రైతుల ఎదురుచూపులు


పెన్నక్కచెరువులో తగ్గిన నీటిమట్టం

కోట, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): రబీ సీజన్‌లో వర్షాలు తగినంత కురవకపోవడంతో రైతులు సందిగ్ధంలో పడిపోయారు. రానున్న డిసెంబరు, జనవరి మాసాల్లో వర్షపాతం తక్కువగా ఉండవచ్చన్న అంచనాల నేపథ్యంలో వరినాట్లు వేసేందుకు రైతులు జంకుతున్నారు. ప్రధానంగా వేలాది ఎకరాల భూములు కలిగిన పెన్నక్కచెరువు ఆయకట్టు రైతులు గంగనీటి కోసం ఎదురు చూస్తున్నారు. కోట మండలం నెల్లూరుపల్లి కొత్తపాళెం వద్ద ఉన్న పెన్నక్కచెరువు కింద సుమారు 7వేల ఎకరాల ఆయకట్టు ఉంది. ఈ భూములన్నీ కోట, చిల్లకూరు మండలాల సరిహద్దున ఉన్నాయి. ఆయా రైతులంతా పెన్నక్కచెరువు నీటితోనే వరి సాగు చేస్తారు. గతేడాది కూడా ఈ చెరువు కింద వరి పుష్కలంగా పండి మంచి దిగుబడి వచ్చింది. అయితే ఈ ఏడాది అదునుదాటిపోతున్నా వర్షాలు సరిగ్గా కురవకపోవడంతో పెన్నక్కచెరువు ఆయకట్టు రైతులు సందిగ్ధంలో పడిపోయారు. గత నెలలో వర్షాలు వస్తాయన్న ఆశతో పెన్నక్కచెరువు కింద రైతులు ఇబ్బడిముబ్బడిగా

7 వేల ఎకరాల్లో ఆగిన వరినాట్లు

వరినాట్లు వేసేందుకు నారుమడులు పోశారు. అయితే చెరువులో తగినంత మేర నీటి నిల్వలేకపోవడం, వర్షాలు అంతంత మాత్రంగా ఉండడంతో ఈసారి వరి సాగుపై రైతులు ఆశలు వదులుకొంటున్నారు.

'గంగ'పైనే ఆశలు

ఇదిలా ఉండగా కండలేరు నుంచి ఊట్లపల్లి వరకు వచ్చే గంగనీరు, అక్కడ నుంచి 5వ బ్రాంచ్ కెనాల్ ద్వారా రెండు విధాలుగా కోట మండలం గూడలి వద్ద ఉన్న స్వర్ణముఖినదిలోకి ప్రవేశిస్తుంది. అక్కడ నుంచి మామిడి కాలువ, చల్లకాలువ ఎస్కేప్ చానల్ మీదుగా పెన్నక్కచెరువులోకి వెళ్లాల్సి ఉంది. అయితే ఇప్పటి వరకు గంగనీటి విడుదల విషయమై స్పష్టత లేకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఊట్లపల్లి నుంచి 400 క్యూసెక్కుల నీటిని కోట మండలానికి స్వర్ణముఖిమీదుగా వదిలితే


వరి నారుమడులు


ఆయకట్టు భూములను దుక్కి చేసి వదిలేసిన రైతులు

పెన్నక్కచెరువు ఆయకట్టు కింద పుష్కలంగా పంటలు పండుతాయని రైతులు చెబుతున్నారు. అదే విధంగా 5వ బ్రాంచ్ కెనాల్ నుంచి మరో మార్గమైన బూదనం, కొండుగుంటల మీదుగా మండలంలోని పలు మెట్ట గ్రామాల్లోని చెరువులకు గంగనీరు వదిలితే ఈ ఏడాది పంటలు పుష్కలంగా పండుతాయని రైతులు అంటున్నారు. ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ చొరవ చూపి మండలానికి గంగనీటిని రప్పించేలా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

గంగనీటిని ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నాం

కోట మండలంలో రైతులకు గంగనీటిని ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నాం. 400 క్యూసెక్కులు వదిలితే ఈ సారి పంటలకు సరిపోతుంది. కండలేరులో 52.69 టీఎంసీలు నీటి నిల్వ ఉంది. నీటికి ఎలాంటి డోకా లేదు.

- శ్రీనివాసరావు, తెలుగుగంగ ఈఈ

విధి నిర్వహణలో అలసత్వం వహిస్తే చర్యలు


హౌస్‌హోల్డ్ సర్వేని పరిశీలిస్తున్న ఎంపీడీవో గుణశేఖర్

డక్కిలి, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): సచివాలయ సిబ్బంది విధి నిర్వహణలో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని ఎంపీడీవో గుణశేఖర్ హెచ్చరించారు. గురువారం ఆయన మండలంలోని నాగవోలు, పలుగోడు, లింగసముద్రం, డక్కిలి, వెంబులూరు సచివాలయాలను పరిశీలించారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ సచివాలయ సిబ్బంది తమకు అప్పగించి పనులను సక్రమంగా, సకాలంలో పూర్తి చేయాలని సూచించారు. ఈ నెలాఖరు లోగా ఇంటింట సర్వే పూర్తి చేయాలని చెప్పారు. వివిధ పనుల కోసం సచివాలయాలకు వచ్చే ప్రజలను తిప్పుకోకుండా సకాలంలో పరిష్కరించాలని సిబ్బందికి సూచించారు. అనంతరం ఆయన సిబ్బందితో కలిసి హౌస్‌హోల్డ్ సర్వేలో పాల్గొన్నారు.

బాలిక కిడ్నాప్ కేసులో నిందితుడి అరెస్టు

పెళ్లకూరు, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): బాలిక కిడ్నాప్ కేసులో నిందితుడిని అరెస్ట్ చేసి విచారిస్తున్నట్లు ఎస్ఐ నాగరాజు గురువారం తెలిపారు. దొరవారిసత్రం మండలం ఏకొల్లు గ్రామానికి చెందిన వెంకటేశ్వర్లు పెళ్లకూరు మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలికను కిడ్నాప్ చేశాడని తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో నిందితుడిని అరెస్ట్ చేసి విచారిస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

మాటుమడుగులో అనధికార విద్యుత్ కోతలు


మాటుమడుగులో కరెంటు కోసం మోటరు వద్ద ఎదురు చూస్తున్న రైతు

డక్కిలి, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మాటుమడుగు ఫీడర్ పరిధిలో అనధికార విద్యుత్ కోతలతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మాటుమడుగు ఫీడర్ పరిధిలో నడింపల్లి, దందవోలు, శ్రీపురం గ్రామాల్లో గురువారం ఉదయం 8.30 గంటలకు త్రీ ఫేజ్ విద్యుత్ ఇచ్చారు. తరువాత గంట వ్యవధిలోనే ఐదారు సార్లు సరఫరా ఆపి మళ్లీ ఇచ్చారు. గత మూడు రోజుల నుంచి కరెంటు ఎప్పుడొస్తుందోనని మోటర్ల వద్ద పడి గాపులు కాసినా రోజుకి అర్ధ ఎకరం కూడా తడవడం లేదని రైతులు వాపోతున్నారు. విద్యుత్ లేని కారణంగా సాగు నీరందక నిమ్మ, జీలుగ, పిల్లిపెసర, జనుము వంటి పంటలు ఎండిపోతున్నాయని రైతులు ఆవేదన చెందుతున్నారు. విద్యుత్ అధికారులను ప్రశ్నిస్తే లైన్లు ట్రిప్ అవడం వల్ల సరఫరాలో ఇబ్బందులు వస్తున్నాయని చెబుతున్నారని రైతులు వాపోతున్నారు.

వానపాములతో ఎరువుల తయారీపై శిక్షణ


ఎరువులు పంపిణీ చేస్తున్న శాస్త్రవేత్త విజయశ్రీ

వెంకటగిరి టౌన్, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): స్థానిక కృషి విజ్ఞాన కేంద్రంలో గురువారం రైతులకు వానపాముల ప్రాముఖ్యం, ఎరువు తయారీ, వినియోగంపై కేవీకే శాస్త్రవేత్త విజయశ్రీ శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వ్యవసాయంలో పశువుల ఎరువు లభ్యత తక్కువగా ఉన్న పరిస్థితుల్లో వానపాముల సేంద్రియ ఎరువుగా ఎంతో ఉపయోగపడుతుందన్నరు. ఎరువు తయారీలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, వివిధ పంటల్లో వినియోగించే విధానం గురించి అవగాహన కల్పించారు. అనంతరం రైతులకు వానపాముల ఎరువు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో తిరుపాల్, నాగార్జున రెడ్డి, టీవీఎస్ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

హౌస్‌హోల్డ్ సర్వేని పక్కాగా నిర్వహించాలి

బాలాయపల్లి, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): హౌస్‌హోల్డ్ జియో టాగింగ్ సర్వేని పక్కాగా నిర్వహించాలని ఎంపీడీవో వినీల్‌కుమార్ అన్నారు. గురువారం మండలంలోని నిడిగల్లు, పిగిలాం, హస్తకావేరి, జయంపు, గొట్టికాడు గ్రామాల్లో జరుగుతున్న సర్వే ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ ప్రభుత్వం అందించే సంక్షేమపథకాలు ప్రజలకు చేరవేసేందుకు హౌస్‌హోల్డ్ జియో టాగింగ్ సర్వే ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. అందరూ తమ వివరాలను నమోదు చేయాలని సూచించారు.

విద్యార్థుల సామర్థ్యాల పరిశీలన

కోట, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని చిట్టేడు ఎస్‌టీటీ కాలనీలోని ప్రాథమిక పాఠశాలను గురువారం ఎంఈవో మస్తానయ్య తనిఖీ చేశారు. విద్యార్థులకు పాఠాలు బోధించారు. వారి సామర్థ్యాలను అంచనా వేశారు. అలాగే పాఠశాలలో రికార్డులను, విద్యార్థులకు వండిపెడుతున్న మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. ఆయన వెంట హెచ్ఎం సంపూర్ణమ్మ తదితరులు ఉన్నారు.


విద్యార్థులకు పాఠాలు బోధిస్తున్న ఎంఈవో మస్తానయ్య

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

మరొకరికి గాయాలు


ధనుంజయ (ఫైల్‌ఫొటో), గాయపడిన నాగరాజు

సూళ్లూరుపేట, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): మోటరు సైకిల్ అదుపు తప్పి కింద పడడంతో ఓ యువకుడు మృతి చెందగా, మరో వ్యక్తికి గాయాలైన ఘటన సూళ్లూరుపేట మండలం కొణ్ణంబట్టు వద్ద గురువారం రాత్రి జరిగింది. పోలీసుల సమాచారం మేరకు.... పశ్చిమ గోదావరి జిల్లా పాలకొల్లుకు చెందిన నాగరాజు సీపీఎల్ పరిశ్రమలో పనిచేస్తున్నాడు. ఇతనికి దొరవారిసత్రం మండలం పోలిరెడ్డిపాలెం గ్రామానికి చెందిన వి.ధనుంజయ(32) స్నేహితుడు. గురువారం ఇద్దరూ కలిసి సూళ్లూరుపేటకు వెళ్లారు. అక్కడ పని ముగిశాక నాగ రాజును సీసీఎల్ కంపెనీలో విడిచిపెట్టేందుకు ధనుంజయ మోటరు సైకిల్‌లో తీసుకొని వెళ్తుండగా కొణ్ణంబట్టు సమీపంలో కొత్తగా నిర్మించిన కల్వర్టు వద్ద అదుపు తప్పి కింద పడ్డారు. ఈ ప్రమాదంలో ధనుంజయ తలకు తీవ్ర గాయమై అక్కడికక్కడే మృతి చెందాడు. నాగరాజుకు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రుడిని సూళ్లూరుపేట ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. మృతుడు వైసీపీ హయాంలో వాలెంటీర్‌గా కూడా పనిచేశాడు. ఈయనకు భార్య, ఇద్దరూ చిన్న పిల్లలున్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కంట్రోల్ రూం ఏర్పాటు

సూళ్లూరుపేట, నవంబర 28 (ఆంధ్రజ్యోతి): ఫెంగల్ తుఫాన్ ప్రభావంతో రాబోయే 48 గంటల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉండడంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ ఎస్వీ నరసింహారావు సూచించారు. ముందస్తు జాగ్రత్తలో భాగంగా తహసీల్దార్ కార్యాలయంలో కంట్రోల్ రూం ఏర్పాటు చేసి సిబ్బందిని అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు ఎదురైనా కంట్రోల్ రూంకు సమాచారం అందించ వచ్చునన్నారు.

టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడికి పరసా పరామర్శ

పెళ్లకూరు, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని శిరసనం బేడు గ్రామానికి చెందిన టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు వేలూరు మురళీకృష్ణారెడ్డి, ఆయన సోదరుడు వేలూరు హరిబాబురెడ్డిని మాజీ మంత్రి పరసారత్నం, తెలుగు మహిళా టీడీపీ అధ్యక్షురాలు పనబాక భూలక్ష్మి వేర్వేరుగా గురు వారం పరామర్శించారు. ఈ నెల 25న మురళీ కృష్ణారెడ్డి తండ్రి జనార్దన్‌రెడ్డి అనారోగ్యంతో మృతి చెందారు. ఈ నేపథ్యంలో మురళీకృష్ణారెడ్డి సోదరులను టీడీపీ నేతలు పరామర్శించారు.

ఎల్లి వరికి వర్షాభావం దెబ్బ

రైతుల్లో ఆందోళన


ఎల్లి పైరు

ఓజిలి, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): ఓజిలి మండలంలో సాగులో ఉన్న ఎల్లి పైర్లను వర్షాభావం దెబ్బతీస్తోంది. ఓజిలి, కురుగొండ, వెంకటరెడ్డిపాళెం, మానమాల, కొండవల్లిపాడు తదితర గ్రామాల్లో సుమారు 800వంద ఎకరాల్లో రైతులు ఎల్లి పైర్లు సాగు చేశారు. ఇటీవల వరకు కురిసిన వర్షాలకు పైర్లు బాగా ఏపుగా పెరిగాయి. ఎల్లి పంట సాగు రైతులు పొలాల్లో విత్తనాలు చల్లి వర్షం కోసం ఎదురు చూస్తుండగా అక్టోబరులో అల్పపీడనం, తుపాను కారణంగా పడిన వర్షాలకు వరి మొలకెత్తి అన్నదాతల్లో ఆశలు రేపింది. ప్రస్తుతం వర్షాభావ పరిస్థితులు నెలకొనడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. కాగా, మండలంలో చెరువుల కింద సాగులో ఉన్న ఆయకట్టు భూముల రైతులు నార్లు పోసుకునేందుకు పొలాలను సిద్ధం చేసుకుని ఉన్నారు. అయితే ఇటీవల కురిసిన వర్షాలకు చెరువుల్లో పెద్దగా నీరు చేరలేదు. దీంతో రైతులు నార్లు పోసుకునేందుకు వెనుకాడుతున్నారు.

రేపే పింఛన్ల పంపిణీ

పుత్తూరు అర్బన్, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఎన్టీఆర్ భరోసా పెన్షన్ పంపిణీ ప్రక్రియకు ప్రతిష్టాత్మకంగా తీసుకున్న సంగతి తెలిసిందే. ఈ క్రమంలో ప్రతి నెలా 1వ తేదీనే పూర్తిస్థాయి పింఛన్ల పంపిణీ జరుగుతోంది. కాగా, డిసెంబర్ 1వ తేదీ ఆదివారం కావడంతో ఒకరోజు ముందుగానే పంపిణీకి అధికారులు చర్యలు చేపట్టారు. పుత్తూరు మున్సిపల్ పరిధిలో 5,710 మంది లబ్ధిదారులు ఉన్నారని కమిషనర్ మంజునాథ్ గౌడ్ తెలిపారు. శనివారం ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం 6 గంటల్లోగా పంపిణీ పూర్తి చేయడానికి చర్యలు చేపట్టామన్నారు. ఈ మేరకు సచివాలయ సిబ్బందిని కూడా ఆదేశించినట్లు తెలిపారు.

ఎన్‌పీసీఐకి ఆధార్ అనుసంధానం తప్పనిసరి

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు సంబంధించిన సంక్షేమ పథకాలు కొనసాగాలంటే లబ్ధిదారులు తప్పకుండా నేషనల్ పేమెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(ఎన్‌పీసీఐ)ను ఆధార్‌కు అనుసంధానం చేసుకోవాలని కమిషనర్ పేర్కొన్నారు. ఈ అనుసంధానం గడువు ఈ నెల 30వ తేదీతో ముగియనుందని స్పష్టం చేశారు. సంక్షేమ పథకాల లబ్ధి బ్యాంకు, పోస్టాఫీసు ఖాతాలకు జమ చేస్తున్నట్టు తెలిపారు. ఈ ఆధార్ అనుసంధానం చేసుకోని క్రమంలో సంక్షేమ నిధులు జమ కావన్నారు. లబ్ధిదారులు వెంటనే తమ పరిధిలోని సచివాలయంలో జియో ట్యాగ్ చేయించుకోవాలన్నారు.

ఉత్సాహంగా టీడీపీ సభ్యత్వ నమోదు


పార్టీ గుర్తింపు కార్డులు చూపుతున్న కార్యకర్తలు

పుత్తూరు అర్బన్, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): టీడీపీ సభ్యత్వ నమోదు ప్రక్రియ జోరుగా సాగుతోంది. గురువారం 6వ వార్డు గేట్ పుత్తూరులో నియోజకవర్గ టీడీపీ ముస్లిం మైనార్టీ సెల్ అధ్యక్షుడు రఫీఅహ్మద్ ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు జరిగింది. రాష్ట్రంలో అత్యధికంగా కేడర్ ఉన్న ఏకైక పార్టీ టీడీపీ అని కొనియాడిన రఫీ... సభ్యత్వ నమోదుతో పరిమితం కాకుండా పార్టీ కోసం పనిచేసే ప్రతి ఒక్కరికీ అండగా ఉంటామన్నారు. సభ్యత్వం నమోదు చేసుకున్న వారికి గుర్తింపు కార్డులు అందించారు. మస్జిద్ ఏ ముఖద్దస్ ముతవల్లీ మహమ్మద్ గౌస్, మైనార్టీ హక్కుల పరిరక్షణ సమితి నియోజకవర్గ అధ్యక్షుడు ఎద్దుల హుస్సేన్, షబ్బర్, హమీద్ బాషా, చాను, బాబు, నజీర్ యూనస్, అమీర్ బాషా, షకీల్, రసూల్ తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో లఘు లక్ష బిల్వార్చన



పుత్తూరు టౌన్, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కేఎస్ రోడ్డులో ఉన్న కామాక్షిదేవి సమేత సదాశివేశ్వర ఆలయంలో ఉన్న అయ్యప్ప గుడిలో 48వ లఘు లక్ష బిల్వార్చన ఘనంగా నిర్వహించారు. ఉదయం 4.30 గంటల నుంచి గణపతి పూజ, లక్ష్మీగణపతి హోమం, అయ్యప్పకు అభిషేకం, మహాభిషేకాలు జరగ్గా, 9 గంటలకు కలశ స్థాపనతో లఘు లక్ష బిల్వార్చన నిర్వహించారు. మధ్యాహ్నం అన్నదానం జరిగింది. సాయంత్రం జ్యోతి పూజను అత్యంత వైభవంగా నిర్వహించారు.

పుత్తూరు వార్తలు

బేస్‌బాల్ క్రీడాకారిణి లోకేశ్వరికి అభినందన



పుత్తూరు, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి బాలికల అండర్-14 బేస్‌బాల్ పోటీల్లో బంగారు పతకం సాధించిన ఉమ్మడి చిత్తూరు జిల్లా జట్టు సభ్యురాలైన లోకేశ్వరిని పాఠశాల ఉపాధ్యాయ బృందం అభినందించింది. పుత్తూరు మండలం గొల్లపల్లి ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న లోకేశ్వరి ఈనెల 24 నుంచి 26వ తేదీ వరకు తిరుపతి మంగళం ట్రేడ్స్‌లో జరిగిన అంతర్‌జిల్లాల పోటీల్లో ప్రాతినిధ్యం వహించింది. ఈ పోటీల్లో ఉమ్మడి చిత్తూరు జిల్లా జట్టు బంగారు పతకం సాధించింది. ప్రధానోపాధ్యాయుడు రమేష్, పీడీ గోపాలకృష్ణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అనైతిక కార్యక్రమాలకు దూరంగా ఉండండి


ఎయిడ్స్ అవగాహన పోస్టర్ల ఆవిష్కరణ

పుత్తూరు, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): యుక్త వయస్సులో దురల వాట్లు, అక్రమ లైంగిక సంబంధాలకు దూరంగా ఉండాలని డాక్టర్ షర్మిల వివరించారు. డిసెంబరు 1న ఎయిడ్స్ దినం సందర్భంగా పుత్తూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎయిడ్స్‌పై అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రక్తమార్పిడి వల్ల ఎయిడ్స్ వ్యాధి వచ్చే అవకాశం ఉందన్నారు. చర్చా వేదిక, రంగోలి, ఎయిడ్స్ అవగాహన పోస్టర్ల ప్రదర్శన పోటీలు జరిగాయి. ప్రిన్సిపాల్ చంద్రమౌళి, డాక్టర్లు సుజనా, వరలక్ష్మి, గాయత్రి, సావిత్రి, పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

చివరి అస్త్రంగానే రసాయనాలు వాడాలి

పుత్తూరు టౌన్, నవంబర్ 28(ఆంధ్రజ్యోతి): సాగులో రసాయన ఎరువులు, మందులు చివరి అస్త్రంగానే వాడే విధంగా రైతులకు అవగాహన కల్పించాలని వ్యవసాయ శాఖ జిల్లా ట్రైనింగ్ కోఆర్డినేటర్ భాస్కరయ్య సూచించారు. గురువారం పట్టణంలోని విశ్రాంత ఉద్యోగుల సంఘ భవనంలో గ్రామస్థాయి విస్తరణ సిబ్బంది శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ... ప్రకృతి సేద్యంతో భూమికి రక్షణ ఉంటుందని, సేంద్రియ ఎరువులు, పశువుల ఎరువులను, పచ్చిరొట్టతో భూములకు పోషణ ఇచ్చి, చీడలను అదుపు చేయవచ్చన్నారు. అనంతరం చీడల నివారణ మార్గాల గురించి ఏవో వేణుగోపాలరావు వివరించారు. ఈ కార్యక్రమంలో తిరుపతి రాస్ కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త దివ్య, శ్రీకాళహస్తి టెక్నికల్ అధికారి సూర్యప్రకాష్ రెడ్డి, వడమాలపేట ఏవో విజయ్‌కుమార్, పుత్తూరు ఏవో కోదండయ్య, నారాయణవనం ఏవో శోభారాణి తదితరులు పాల్గొన్నారు.

అవినీతిమయం.. పుత్తూరు పట్టణ ప్రణాళిక విభాగం

- ప్రతి నిర్మాణానికి ఓ రేటు
- సచివాలయం సిబ్బందికే ఆక్రమణల గుర్తింపు
- వసూళ్ల బాధ్యతలు

పుత్తూరు అర్బన్, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): పుత్తూరు పట్టణం వేగంగా విస్తరిస్తోంది. ఇంతే వేగంగా టౌన్ ప్లానింగ్ విభాగం అవినీతిమయవుతోంది. అక్రమ నిర్మాణాలపై అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు. ఒక్కో అక్రమ నిర్మాణానికి ఒక్కో రేటు లెక్కన వసూళ్లకు పాల్పడుతున్నారనే ఆరోపణలున్నాయి. ఏటా వందల సంఖ్యలో ఇళ్ల నిర్మాణాలను అనుమతులు లేకుండా యథేచ్ఛగా చేపడుతున్నారు. నిబంధనల ప్రకారం చేపట్టిన ఇళ్ల యజమానులను కూడా ప్రణాళిక విభాగం సిబ్బంది వదలడం లేదు. ప్లాట్ విస్తీర్ణం, ఏ మేరకు నిబంధనలు ఉల్లంఘించారనే దానిపై అధికారులు అంచనా వేసి అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నారు. ఇప్పుడున్న నిబంధనల మేరకు పుత్తూరులో జీ+2 మాత్రమే నిర్మించాల్సి ఉంది. పట్టణంలో దాదాపు వంద బహుళ అంతస్తుల భవనాలు నిబంధనలకు విరుద్ధంగా ఉన్నాయి. దాదాపు 500 అక్రమ నిర్మాణాలకు నోటీసులు జారీ చేసినట్లు పట్టణ ప్రణాళిక విభాగం అధికారి ఒకరు తెలిపారు. అంటే అక్రమ నిర్మాణాలు ఏ స్థాయిలో జరిగాయో అవగతమవుతోంది. నిర్మాణాలకు సంబంధించి ఆన్‌లైన్ దరఖాస్తుల క్షేత్ర స్థాయి పరిశీలన పేరుతో జాప్యం చేస్తున్నారు. సిబ్బంది ఆశించిన డబ్బులు ఇస్తే త్వరగా అనుమతులు ఇస్తున్నారనే విమర్శలున్నాయి. అక్రమ నిర్మాణాల నగదును టౌన్‌ప్లానింగ్ అధికారులకు ఇవ్వడం వంటి వ్యవహారాలను 13 మంది సచివాలయం ప్రణాళిక సిబ్బంది ఎంతో బాధ్యతాయుతంగా నిర్వహిస్తున్నట్టు ఆరోపణలున్నాయి.



నిబంధనల ప్రకారమే నిర్మాణాలు

ఇప్పటి వరకు జరిగిన నిర్మాణాల జోలికి వెళ్లలేం. ఇకపై అనుమతుల మేరకు నిర్మాణాలు చేపట్టేలా చర్యలు చేపడతాం. అక్రమ నిర్మాణాలకు పాల్పడిన వారికి నోటీసులు జారీ చేస్తాం. ప్రస్తుతం భవన నిర్మాణ దరఖాస్తుల ఆమోదంలో జాప్యం నెలకొంటోంది. సర్వర్ ఆధునీకరణ పనులు జరుగుతుండటంతో గత 15 రోజులుగా ఆన్‌లైన్ ప్రక్రియ పనిచేయడం లేదు. నిర్మాణాలకు తాత్కాలిక అనుమతులు ఇస్తున్నాం.

- నీరజాక్షి, పట్టణ ప్రణాళిక విభాగం అధికారి

తెలుగు అధ్యాపకురాలు శశికళకు సన్మానం


శశికళను సన్మానిస్తున్న సదస్సు నిర్వాహకులు

నాయుడుపేట టౌన్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): ఆదికవి నన్నయ్య విశ్వవిద్యాలయం, మద్రాసు విద్యాలయం సంయుక్తంగా పశ్చిమ గోదావరి జిల్లా పెనుగొండలో ఈనెల 27, 28 తేదీల్లో విశ్వర్షి వాసిలి వాఙ్మయ వరివస్య అంతర్జాతీయ తెలుగు సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ వాసవీ వసంతకుమార్ సాహిత్యంపై నాయుడుపేట మండలం పూదూరులోని అంబేడ్కర్ బాలికల గురుకులంలో తెలుగు అధ్యాపకురాలు తన్నీరు శశికళ పేపర్ ప్రజంటేషన్ ఇచ్చారు. ఆమెన సదస్సు నిర్వాహకులు విశ్వర్షి, రామమోహన్ రావు, వరప్రసాద్ తదితరులు సన్మానించారు.

జాతీయ రహదారి పక్కనే వ్యర్థాలు


ఎంకేఎం కల్యాణ మండపం సమీపంలో జాతీయ రహదార పక్కనే పడేసిన కొబ్బరి బొండాలు

సూళ్లూరుపేట, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట సమీపంలోని జాతీయ రహదారిపై ఎక్కడ పడితే అక్కడ కొబ్బరి బొండాలు, కుళ్లిన పండ్లు ఇతర వ్యర్థాలను పడేస్తున్నారు. సూళ్లూరుపేట నుంచి నెల్లూరు వైపు వెళ్లే మార్గంలో ఎంకేఎం కల్యాణ మండపం, కోటపోలూరు క్రాస్ రోడ్డు వద్ద తాగేసిన కొబ్బరి బొండాలను కుప్పలు కుప్పలుగా ఎడేస్తున్నారు. అదే విధంగా చెంగాళమ్మ ఆలయ సమీపంలోని గోశాల వద్ద, వాటంబేడు రోడ్డులోనూ ఇదే పరిస్థితి. వాటంబేడు రోడ్డులో కాళంగి నది అంచునే వ్యర్థాలు వేస్తుండడంతో దుర్వాసన వెదజల్లుతోంది. కొబ్బరి బొండాల్లో నీరు నిల్వ చేరి దోమలకు ఆవాస కేంద్రాలుగా మారుతున్నాయి. వర్షాకాలం కావడంతో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉంది. సంబంధిత అధికారులు స్పందించి రోడ్డు పక్కన్న వ్యర్థాలను తొలగించాల్సిన అవసరం ఉంది.

గిరిజన కుటుంబానికి ఆర్థిక సాయం


రమేష్ దంపతులకు నగదు అందజేస్తున్న వెంకయ్యగౌడ్

కోట, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కొత్తపట్నం పంచాయతీలో గల యమదిన్నెపాళెం గిరిజన కాలనీకి చెందిన ఈటిపాకల రమేష్ దంపతులకు గురువారం ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ ఆదుకున్నారు. రెండు రోజుల క్రితం రమేష్‌కు చెందిన పూరిల్లు షార్ట్ సర్క్యూట్‌కు పూర్తిగా కాలిపోయింది. కట్టుబట్టలతో బయటపడిన ఆ కుటుంబానికి ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ రూ.10వేలు సాయం చేయగా, ఆ నగదును స్థానిక టీడీపీ నాయకుడు కొమారి వెంకయ్యగౌడ్ అందజేశారు.

గురుదక్షిణామూర్తికి శాస్త్రోక్తంగా పూజలు



శ్రీకాళహస్తి, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయంలో కొలువై ఉన్న మేధో గురు దక్షిణామూర్తికి గురువారం వేద పండితుల ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. ముందుగా కలశ ప్రతిష్ఠ చేశారు. అనంతరం వినాయక, కలశ పూజ క్రతువులు నిర్వహించారు. స్వామివారికి పాలు, పెరుగు, పంచామృతం, చందనం, నారికేళ జలాలతో అభిషేకించారు. సుగంధ పరిమళాలు వెదజల్లే పూలు, స్వర్ణాభరణాలతో విశేషంగా అలంకరించి ధూప, దీప నైవేద్యాలు సమర్పించారు. పర్వత, చక్ర, కుంభ, మహా మంగళ హారతులు సమర్పించారు. భక్తులు పెద్దసంఖ్యలో స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ అధికారులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ఘనంగా కార్తీక వన భోజనాలు



భోజనం వడ్డిస్తున్న ఈవో బాపిరెడ్డి తదితరులు

శ్రీకాళహస్తి, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయ ఆధ్వర్యంలో గురువారం కార్తీక వనభోజన మహోత్సవం ఘనంగా జరిగింది. ఆలయానికి అనుబంధంగా నిర్వహిస్తున్న భరద్వాజతీర్థం సమీపంలోని గంగా సదన్‌లో ఈ వనభోజన మహోత్సవం జరిగింది. ఈవో బాపిరెడ్డి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆలయ ఉద్యోగులు, సిబ్బంది, పలువురు ప్రముఖులు, ప్రజలు, విద్యార్థులు వన భోజన మహోత్సవంలో పాల్గొన్నారు. తుఫాను నేపథ్యంలో వన బోజనాలను గంగా సదన్‌లో నిర్వహించారు.

వైభవంగా ప్రదోష పూజలు



సత్యవేడు, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సురుటుపల్లెలో కొలువై ఉన్న సర్వమంగళాదేవి సమేత పళ్లికొండేశ్వరస్వామి ఆలయంలో కార్తీక మాసం పురస్కరించుకుని నందీశ్వరుడికి, వాల్మీకేశ్వరస్వామికి గురువారం ఏకకాలంలో ప్రదోష పూజలను అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి అమ్మవార్లకు, ప్రదోష నందీశ్వరుడిని అభిషేకించి వివిధ పుష్పాలతో అలంకరించి ధూప, దీప, నైవేద్యాలు సమర్పించారు. మహా దీపారాధన చేపట్టారు. ప్రదోష పూజల సందర్భంగా ఆలయానికి పెద్ద ఎత్తున భక్తులు విచ్చేసి శివన్నామ స్మరణలతో మారుమోగించారు. కార్యక్రమాన్ని ఆలయ ఈవో లత పర్యవేక్షించారు.

ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీతకు సన్మానం



సత్యవేడు, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత కామాక్షయ్యను యూటీఎఫ్ నాయకులు సన్మానించారు. నాగలాపురం ఉన్నత పాఠశాలలో గురువారం నిర్వహించిన యూటీఎఫ్ స్వర్ణోత్సవాల్లో భాగంగా ఎంఈవో బాబయ్య సమక్షంలో రాష్ట్ర కార్యదర్శి ఎస్ఎస్‌నాయుడు, జిల్లా కార్యదర్శి శేఖర్ కామాక్షయ్యను ఘనంగా సన్మానించారు కార్యక్రమంలో రవి, మునిరత్నం, వెంకటేష్, తంగరాజ్, భూషణం తదితరులు పాల్గొన్నారు.

జిల్లా సభలను జయప్రదం చేయండి: సీపీఎం

సత్యవేడు/ నారాయణవనం, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): గత అనుభవాలు, వైఫల్యాలను చర్చించి భవిష్యత్ కార్యాచరణ ప్రణాళిక రూపొందించడానికే జిల్లా సభలను నిర్వహిస్తున్నట్టు సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు దాసరి జనార్దన్ తెలిపారు. గురువారం స్థానిక పార్టీ కార్యాలయంలో జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ... తిరుపతి జిల్లా ఏర్పడ్డాక సత్యవేడులో డిసెంబరు 1, 2 తేదిల్లో సభలు జరుగుతాయన్నారు. కార్మిక, కర్షక, అసంఘటిత రంగ ఉద్యోగుల సమస్యలపై కూలంకషంగా చర్చించి విధివిధానాలను రూపొందించనున్నట్టు తెలిపారు. సీపీఎం మండల కార్యదర్శి రమేష్, శ్రామిక మహిళా జిల్లా కార్యదర్శి లక్ష్మీ, ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి రవి, మండల కార్యదర్శి మురళి తదితరులు పాల్గొన్నారు. జిల్లా సభలకు విరాళాలు అందజేసి విజయవంతం చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు పేర్కొన్నారు. నారాయణవనం మండలంలోని వెత్తలతడుకు గ్రామస్తులు సభల విజయవంతానికి రూ.10 వేలు విరాళం అందించారు.

జాతీయస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థినికి ఆర్థికసాయం



నారాయణవనం, నవంబర్ 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని అరణ్యంకండ్రిగ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని కే.వసుకు పాఠశాల ఉపాధ్యాయులు రూ.10 వేలు సాయం అందజేశారు. ఈసందర్భంగా హెచ్ఎం కృష్ణమూర్తి మాట్లాడుతూ పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న కే.వసు ఇటీవల విజయనగరం జిల్లా భోగాపురం ఉన్నత పాఠశాలలో జరిగిన ఎస్‌జీఎఫ్ రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీల్లో విశేష ప్రతిభ కనబరచి, జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు

జ్యోతిరావు పూలేకు నివాళులు



పూలేకు నివాళులర్పిస్తున్న టీడీపీ బీసీసెల్ నాయకులు

శ్రీకాళహస్తి, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో గురువారం జ్యోతిరావు పూలే వర్ధంతిని నిర్వహించారు. ఆయన చిత్రపటానికి టీడీపీ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. వారు మాట్లాడుతూ విద్యాభివృద్ధికి, మహిళా విద్యకు ఆయన తన భార్య సావిత్రిబాయి పూలేతో కలిసి చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో మిన్నల రవి, ఉమేష్‌రావు, పేట బాలాజీ, బుజ్జి, వెంకటేష్, మునిరాజాయాదవ్, చౌదరి తదితరులు పాల్గొన్నారు. పట్టణంలోని అంబేద్కర్ భవన్‌లో గురువారం ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయిస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మహాత్మా పూలేకు నివాళులర్పించారు. అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి చెంచయ్య, వెంకటాద్రి, సురేష్‌బాబు, గజేంద్ర, పి.గజేంద్ర, శ్రీహరి, సుబ్బరాయుడు, గోవిందయ్య, గోపి పాల్గొన్నారు.


బుచ్చినాయుడుకండ్రిగ: మండల కేంద్రంలోని బీసీ హాస్టల్‌లో మహాత్మ జ్యోతిబాపూలే వర్ధంతిని వార్డెన్ రామయ్య ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా పూలే సేవలను విద్యార్థులకు వివరించారు.

సత్యవేడు: పట్టణంలోని ఎంజేపీబీ బాలుర గురుకుల పాఠశాలలో ప్రిన్సిపాల్ శ్రీనివాసులు ఆధ్వర్యంలో పూలే వర్ధంతిని నిర్వహించారు. దేశం గర్వించదగ్గ సంఘ సంస్కర్తల్లో మహాత్మ జ్యోతిబా అగ్రగణ్యుడన్నారు. అంటరానితనం, కుల వివక్ష నిర్మూలనతో పాటు మహిళోద్ధరణ కోసం కృషి చేశారని కొనియాడారు.

ముక్కంటి ఆలయంలో ఆకాశదీపం

శ్రీకాళహస్తి, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): కార్తీక మాసాన్ని పురస్కరించుకుని ముక్కంటీశుడి ఆలయంలో ప్రతి రోజు ఆకాశదీపాన్ని వెలిగించడం ఆనవాయితీ. ఆలయ వేదపండితులు గురువారం ఊంజల్‌మండపం వద్ద కార్తీక దీపానికి పూజలు చేసి స్తూపానికి జ్యోతిని అమర్చి ఆకాశదీపంగా ఎగురవేశారు. ఈవో బాపిరెడ్డి సతీమణి సుధ, ఆలయ అధికారులు పాల్గొన్నారు.





నదీ హారతులకు ముమ్మర ఏర్పాట్లు



శ్రీకాళహస్తి, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయం వద్ద ఈనెల 30న శనివారం రాత్రి జరగనున్న స్వర్ణముఖి నది హారతుల మహోత్సవానికి ఏర్పాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి. ముక్కంటి ఆలయం పక్కనే స్వర్ణముఖి నదిలో గంగ హారతుల కోసం వారం రోజుల ముందు నుంచే అధికారులు అవసరమైన ఏర్పాట్లు చేపట్టారు. హారతులు సమర్పించే ప్రాంతాన్ని విశేషంగా విద్యుత్ అలంకరణలతో శోభాయమానంగా తీర్చిదిద్దారు. రెండు రోజుల ముందుగానే గురువారం రాత్రి నదీహారతుల సందడి నెలకొంది.

పంచాయతీలకు కార్యదర్శుల కొరత

సత్యవేడు, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): పంచాయతీలకు కార్యదర్శుల కొరత వేదిస్తోంది. దీంతో పంచాయతీల అభివృద్ధి గాడితప్పి పాలన అటకెక్కుతోందని విమర్శలు వినబడుతున్నాయి. సత్యవేడు మండలంలో 28 పంచాయతీలకుగాను 11 మంది కార్యదర్శులే ఉన్నారు. ఒక్కో కార్యదర్శికి నాలుగైదు పంచాయతీలకు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. దీంతో పనిభారం ఎక్కువై పాలన ముందుకు సాగక సేవలు మందగిస్తున్నాయి.

కాదిరివేడు పంచాయతీ కార్యదర్శే మదనంజేరి, ఆంబాకం, శిరుణంబూదూరులకు ఇన్‌చార్జిగా వ్యవహరిస్తున్నారు. ఆరూరు పంచాయతీ కార్యదర్శి మల్లవారిపాళెం ఈస్ట్, మల్లవారిపాళెం వెస్ట్, ఇరుగుళం, కాళమనాయుడుపేటకు ఇన్‌చార్జిగా, పీవీపురం కార్యదర్శి అల్లప్పగుంట, కన్నవరం, రాజగోపాలపురంలకు ఇన్‌చార్జిగా, ఏఎంపురం పంచాయతీ కార్యదర్శి వీఆర్‌కండ్రిగ, రేపల్లెవాడలకు, పెద్ద ఈటిపాకం కార్యదర్శి చిన్నఈటిపాకం, వా నెల్లూరులకు, పుదుకుప్పం కార్యదర్శి మదనం బేడు పంచాయతీకి, కొల్లడం కార్యదర్శి చెరివి పంచాయతీకి, కొత్తమారికుప్పం కార్యదర్శి దాసుకుప్పం పంచాయతీలకు ఇన్‌చార్జి కార్యదర్శులుగా అదనపు బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఇటీవల ప్రభుత్వం చేపట్టిన బదిలీల్లో భాగంగా మండలంలో విధులు నిర్వహిస్తున్న నలుగురు కార్యదర్శులు ఇతర మండలాలకు వెళ్లారు. వీరి స్థానంలో నలుగురు కార్యదర్శులను నియమించిన ఇప్పటి వరకు ఇద్దరు మాత్రమే విధుల్లో చేరారు. ఇదిలా ఉండగా గ్రామీణ ప్రాంత ప్రజలకు ఆన్‌లైన్ సేవలు అందించాలన్న లక్ష్యంతో ఇటీవల ప్రభుత్వం చేపట్టిన స్వర్ణ పంచాయతీ వెబ్‌సైట్ నమోదు ప్రక్రియ, ఎన్‌పీసీఐ నమోదు తదితర పనులు మందకొడిగా సాగుతున్నాయి. లక్ష్యం మేరకు నమోదు ప్రక్రియ జరగకపోవడంతో కార్యదర్శులకు ఉన్నతాధికారులు మెమోలు అందజేసినట్లు సమాచారం. దీంతో ప్రస్తుతం ఉన్న కార్యదర్శులు కూడా సెలవుపై వెళ్లాలని భావిస్తున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి మండలంలో కార్యదర్శుల కొరత తీర్చాల్సిన అవసరం ఉంది.

సంతాన సంపద వెంకన్నకు ప్రత్యేక పూజలు



ఏర్పేడు, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని వికృతమాలలో కొలువై ఉన్న సంతాన సంపద వేంకటేశ్వరస్వామికి గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. మొదట స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించి విశేషంగా అలంకరించి భక్తులకు నేత్రదర్శనం కల్పించారు. స్వామివారికి వేదపండితులు కృష్ణమాచార్యులు, రత్నాకరం ఆచార్యులు ఆధ్వర్యంలో పూలంగి సేవ శాస్త్రోక్తంగా సాగింది.

వ్యాధి నిర్ధారణ రక్తపరీక్షలు

వరదయ్యపాళెం, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని పంచాయతీ కార్యాలయంలో చాగణం లలితమ్మ భాస్కర్ రావు మెమోరియల్ ట్రస్టు నిర్వాహకుడు గౌరీశంకర్ ఆధ్వర్యంలో వ్యాధి నిర్ధారణ ఉచిత పరీక్షలు నిర్వహించారు. ఉప సర్పంచ్ చంద్రబాబు, గుత్తి త్యాగరాజు, షేక్ అబ్దుల్లా, ముని భూషణమ్మ, ట్రస్టు ప్రతినిధులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

క్యాన్సర్ స్ర్కీనింగ్ పరీక్షలు తప్పనిసరి



మహిళలను పరీక్షిస్తున్న వైద్యులు

వరదయ్యపాళెం, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): ప్రాథమిక దశలో రొమ్ము క్యాన్సర్‌ను గుర్తించేందుకు 35ఏళ్లు దాటిన మహిళలందరూ మామోగ్రామ్ పరీక్షలు చేయించుకోవాలని వరదయ్యపాళెం పీహెచ్‌సీ వైద్యాధికారి ఉదయ్‌కుమార్ తెలిపారు. స్విమ్స్, శ్రీబాలాజీ ఇనిస్టిట్యూట్ ఆఫ్ అంకాలజీ ఆధ్వర్యంలో మండలంలోని సీఎల్ఎన్‌పల్లి, ఇందిరానగర్‌లలో నోరు, రొమ్ము, గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ పరీక్షలను నిర్వహించారు. కాగా ఈనెల 29న శుక్రవారం మరదవాడ, సంతవేలూరు, డిసెంబరు 2న వరదయ్యపాళెం-2, కదూరులో ఈ పరీక్షలు చేయనున్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ద్వైత, శ్రీబాలాజీ ఇనిస్టిట్యూట్ ఆఫ్ అంకాలజీ వైద్యులు హరిత, చైతన్య, భాను, సర్పంచులు వేణు, వీరభద్రయ్య, స్థానిక నాయకులు సుదర్శన్, జయచంద్రనాయుడు, గుత్తి త్యాగరాజు, గురుస్వామి, భరత్‌రెడ్డి, తులసమ్మ, కార్యదర్శి చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.

దుమారం రేపుతున్న పంచాయతీ నోటిఫికేషన్

సవరించి విడుదల చేస్తామన్న కార్యదర్శి



వివాదానికి కారణమైన అద్దె గదులు

రేణిగుంట, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): పంచాయతీ ఈవో విడుదల చేసిన దుకాణాల వేలం నోటిఫికేషన్ దుమారం రేపుతోంది. మేజర్ పంచాయతీకి సంబంధించి మార్కెట్, వారపు సంత, బస్టాండు, దుకాణాల గడువు తీరి ఎనిమిది నెలలు అవుతుండడంతో కొత్తగా వేలం నిర్వహించడానికి పంచాయతీ కార్యదర్శి మణి నోటిఫికేషన్ విడుదల చేశారు. గత వైసీపీ హయాంలో బస్టాండు వద్ద పడమర వైపు దుకాణాన్ని నెల అద్దె రూ.3వేల తక్కువకు ఇవ్వడంతో ఎవరికివారు ఇక్కడ ఏడు దుకాణాలు నిర్మించుకున్నారు. దీంతో నూతనంగా పంచాయతీ కార్యదర్శి టెండరు నోటీసు విడుదల చేశారు. అయితే బస్టాండు వద్ద పడమర దుకాణాలకు నెలబాడుగకు అని పొందుపరచడంతో తీవ్ర దుమారం రేగుతోంది. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో పంచాయతీ ఆదాయానికి గండిపడేలా నెల బాడుగకు ఇవ్వడం విమర్శలకు దారితీసింది. నేడు కూడా ఇదే సంప్రదాయాన్ని కొనసాగిస్తూ పడమర వైపు దుకాణాలు నెలబాడుగకు అని పొందుపరచడం చర్చనీయాంశంగా మారింది. ఈ విషయమై పంచాయతీ కార్యదర్శిని వివరణ కోరగా గతంలో ఇచ్చిన నోటిఫికేషన్‌ను పరిశీలించకుండా ఇవ్వడం జరిగిందని సవరణ చేసి మళ్లీ ఇస్తామని తెలిపారు.

నిబద్ధత, క్రమశిక్షణతోనే విజయం

ప్రముఖ సాహితీవేత్త కిరణ్‌ప్రభ



కిరణ్ ప్రభ దంపతులను సత్కరిస్తున్న రవీంద్ర సన్నారెడ్డి

శ్రీసిటీ, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): ప్రతిఫలం ఆశించకుండా నిబద్ధత, క్రమశిక్షణతో పనిచేస్తే విజయం దానంతట అదే వెతుక్కుంటూ వస్తుందని ప్రముఖ సాహితీవేత్త, ప్రఖ్యాత టాక్ షో ప్రయోక్త కిరణ్ ప్రభ అన్నారు. శ్రీసిటీ ఆధ్యాత్మిక, సాహితీ వేదిక శ్రీవాణి ఆధ్వర్యంలో గురువారం శ్రీసిటీలో నిర్వహించిన కార్యక్రమానికి ఆయన తన సతీమణి కాంతికిరణ్‌తో కలిసి పాల్గొన్నారు. వారికి శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి స్వాగతం పలికి సత్కరించారు. ప్రపంచవ్యాప్తంగా తెలుగు సాహిత్యాభిమానులతో తన అద్భుత ప్రయాణాన్ని, అనుభవాలను కిరణ్‌ప్రభ పంచుకున్నారు. తన తొలినాళ్లను గుర్తు చేసుకుంటూ తెలుగు సాహిత్యం, సంస్కృతిపై మక్కువే తన జీవితాన్ని ప్రభావితం చేసిందన్నారు. విద్యార్థి రోజుల్లో తాను చేతి రాతతో తెలుగు పత్రికను ప్రచురించడం ఈ గొప్ప ప్రయత్నానికి పునాదిగా నిలిచిందన్నారు. నేడు తన భార్యతో కలిసి కౌముది మాసపత్రికను నడుపుతున్నామని తెలిపారు. ప్రముఖుల జీవిత చరిత్రలు, యువం తరాలకు స్ఫూర్తినిచ్చేలా వారి ఆదర్శవంతమైన జీవిత విశేషాలను టాక్ షోల ద్వారా తాను వివరిస్తున్నట్లు చెప్పారు. సాహిత్యం.

ఆకట్టుకున్న శాస్త్రీయ నృత్యం



కూచిపూడి కళాకారులు

శ్రీకాళహస్తి, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌కు చెందిన రాగరమ్య కల్చరల్ అండ్ సోషల్ ఆర్గనైజేషన్ బృందం ప్రదర్శించిన శాస్త్రీయ నృత్యాలు సభికులను ఆకట్టుకున్నాయి. కార్తీక మాసోత్సవాల్లో భాగంగా బుధవారం రాత్రి శ్రీకాళహస్తీశ్వరాలయంలో జరిగిన సాంస్కృతిక కార్యక్రమాల్లో కూచిపూడి నృత్యప్రదర్శన అలరించింది. కూచిపూడి నాట్య గురువులు పద్మలత, జానకి, మాధవి తదితరులు పాల్గొన్నారు. కళాకారులను ఆలయ అధికారులు ఘనంగా సత్కరించి ముక్కంటి ప్రసాదాలను అందజేశారు.

కొద్దిపాటి వర్షానికే... బురదమయంగా గ్రామీణ రోడ్లు



రొచ్చురొచ్చుగా మారిన కొత్తకాలనీ వీధి

కేవీబీపురం, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): మండలంలో గ్రామీణ మట్టి రోడ్లు దుర్భరంగా మారాయి. కొద్దిపాటి వర్షానికే నడవడానికి వీలులేని పరిస్థితిలో రొచ్చురొచ్చుగా తయారవుతున్నాయి. ఇటీవల ప్రభుత్వం ప్రకటించిన వీధుల్లో గ్రామీణ రహదారులకు ప్రాధాన్యం ఇవ్వకపోవడం బాధాకరమని ప్రజలు అంటున్నారు. గతంలో వేసిన రోడ్లకే నిధులు మంజూరు చేయడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నిస్తున్నారు. మొదటి నుంచి ఉన్న మట్టిరోడ్లకు దిక్కులేకుండా పాత వాటికే మరమ్మతులు చేసుకుంటూ పోతే కొత్త వీధులకు మొదలు పెట్టేదెప్పుడని ప్రశ్నిస్తు న్నారు. అధికారులు, నాయకులు స్పందించి మట్టి రోడ్లను సిమెంటు రోడ్లుగా మార్చాలంటూ గ్రామీణులు కోరుతున్నారు.

బలవంతపు వసూళ్లకు పాల్పడితే కఠిన చర్యలు

డీఎస్పీ నరసింహమూర్తి

శ్రీకాళహస్తి, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): పట్టణంలో ఏడుగంగమ్మల జాతర పేరుతో బలవంతపు వసూళ్లకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని డీఎస్పీ నరసింహమూర్తి హెచ్చరించారు. ఈ మేరకు ఆయన గురువారం చందాల వసూళ్లపై ప్రకటన జారీ చేశారు. డిసెంబరు 2వ వారంలో శ్రీకాళహస్తి పట్టణంలో జరగనున్న ఏడుగంగమ్మల జాతర పేరుతో కొంతమంది బలవంతంగా చందాలను వసూలు చేస్తున్నట్లు తమకు ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. ప్రజలను వేధించేవారిని ఉపేక్షించమని చెప్పారు. వసూళ్లపై ఎంతటి వారిపైన అయినా చర్యలు తప్పవన్నారు.

మ్యాన్‌హోల్స్‌పై మూతల ఏర్పాటు



మంగళవీధిలో మ్యాన్‌హోల్‌పై ఏర్పాటు చేసిన మూత

శ్రీకాళహస్తి, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మంగళవీధిలో మ్యాన్‌హోల్స్‌పై అధికారులు మూతలు ఏర్పాటు చేశారు. మంగళవీధి ప్రాంతంలో గురువారం పురపాలక సంఘ కమిషనర్ గిరికుమార్ వార్డ్ వాచ్‌లో భాగంగా పర్యటించారు. ఈ సందర్భంగా స్థానికులు తమ ప్రాంతంలో మ్యాన్‌హోల్స్ సమస్యను వివరించారు. మంగళవీధి ప్రాంతంలో పలు ప్రాథమిక పాఠశాలలు ఉండటంతో విద్యార్థులకు ప్రమాదం పొంచి ఉందని ఆయన దృష్టికి తీసుకువచ్చారు. కమిషనర్ వెంటనే స్పందించి మ్యాన్‌హోల్స్‌పై మూతలు ఏర్పాటు చేయించారు. దీనిపై స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.







నారావారిపల్లెలో జరిగిన చంద్రగిరి మాజీ ఎమ్మెల్యే నారా రామ్మూర్తి నాయుడి దశ దిన కర్మలో శ్రీకాళహస్తి, నగరి, సత్యవేడు ఎమ్మెల్యేలు బొజ్జల సుధీర్, గాలి భానుప్రకాష్, ఆదిమూలం పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేలు రామ్మూర్తి నాయుడికి నివాళులర్పించారు

- శ్రీకాళహస్తి, ఆంధ్రజ్యోతి